గురువారం
09-03-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 256
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జెలెన్‌స్కీని కలిసిన గుటెరస్

ధాన్యం ఎగుమతిపై చర్చ

2లో

లిఖితంగా ఇవ్వకుంటే...

ఉద్యమం యథాతథం

- సీఎస్‌తో ఏపీ జేఏసీ నేతల భేటీ
- అప్పడే పునరాలోచన : బొప్పరాజు, దామోదరరావు
- నేడు రెవెన్యూ భవన్‌లో అత్యవసర సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సమస్యలపై మంత్రుల కమిటీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)తో చర్చించిన హామీలపై లిఖిత పూర్వకంగా ఇస్తేనే ఉద్యమం కొనసాగింపుపై పునరాలోచిస్తామని, లేకుంటే యథాతథంగా కార్యాచరణ ఉంటుందని ఏపీ జేఏసీ అమరావతి స్పష్టం చేసింది. దీనిపై గురువారం విజయవాడ రెవెన్యూ భవన్‌లో జరగనున్న అత్యవసర రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనుంది. ఉద్యోగుల ఆర్థిక అంశాలపై మంత్రుల కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, లిఖితపూర్వకంగా ఇచ్చే మినిట్లపై రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏపీ జేఏసీ, అమరావతి జేఏసీ నేతలు చర్చిస్తారు. ఈనెల 7వ తేదీ రాత్రి వరకు మంత్రుల కమిటీతో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ బృందం, ఇతర జేఏసీ నాయకత్వంతో సమావేశం నిర్వహించింది. ఇందులో ప్రధానంగా ఆర్థిక, ఆర్థికేతర అంశాలపై సుదీర్ఘంగా మూడు గంటలపాటు చర్చించారు. ఉద్యోగులు వాళ్ల కుటుంబ అవసరాల కోసం దాచుకున్న డబ్బులు, చట్టబద్ధంగా రావాల్సిన జీతభత్యాలు ఈ నెలాఖరు లోగా (మార్చి 31లోపు) దాదాపు రూ.3 వేల కోట్లు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం విదితమే. వాటితో పాటు చట్టప్రకారం ఉద్యోగులకు చెల్లించాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్లు, డీఏ బకాయిల సొమ్ము దాదాపు రూ.2 వేల కోట్లను ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెలలోగా రెండు విడతల్లో (రెండు క్వార్టర్లలో)

- మిగతా 2 లో

అమరావతి భూములపై కన్ను

దశలవారీ విక్రయానికి రంగం సిద్ధం

- పేదల సంక్షేమ పథకాల పేరుతో సర్కారు కుట్ర
- తారస్థాయికి ఆర్థిక కష్టాలు, అప్పులు
- వీటిని అధిగమించేందుకే రాజధాని భూముల అమ్మకం
- ప్రభుత్వ నిర్ణయంపై మండిపడుతున్న రైతులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నాలుగేళ్లుగా ఎడాపెడా అప్పులు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రస్తుతం అన్నివైపులా తలుపులు మూసుకుపోవడంతో రాజధాని నిర్మాణానికి రైతులు ఉచితంగా ఇచ్చిన భూములపై కన్ను పడింది. సీఆర్‌డీఏ చట్టం ప్రకారం రాజధాని నిర్మాణానికి మినహాయిస్తే, ప్రభుత్వానికి కొంత భూమి మిగులుతుంది. ఈ భూమిని రాష్ట్ర ప్రభుత్వం దశలవారీ విక్రయించి సొమ్ము చేసుకోవాలని ప్రయత్నిస్తోంది. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన దగ్గర నుంచి మూడు రాజధానుల పేరుతో అమరావతి విధ్వంసానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్న విషయం తెల్సిందే. వాస్తవానికి అమరావతి స్వయం సమృద్ధి ప్రాజెక్టు అయినప్పటికీ, దానికి లక్షల్లో ఖర్చు అవుతుందని పాలక పెద్దలు దుష్ప్రచారం చేస్తూ రాజధాని నిర్మాణ పనులను సీఎం జగన్ ప్రమాణ స్వీకారం రోజు నుంచే పూర్తిగా నిలిపివేశారు. కనీసం రైతులకిచ్చిన ప్లాట్లను కూడా అభివృద్ధి చేయలేదు. నాలుగేళ్లుగా రాజధాని ప్రాంతంలో తట్ట మట్టి కూడా వేయని ప్రభుత్వం...ఇపుడు పేద ప్రజల సంక్షేమ పథకాల పేరుతో ఆ భూములు తెగనమ్మి... ఆ ఖ్యాతిని తన ఖాతాలో వేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి మించిపోవడంతో ఇప్పుడు అప్పులు పుట్టడం కూడా కష్టంగా మారింది. ఆరు నెలలుగా ప్రభుత్వ ఉద్యోగులకు సైతం జీతాలు సక్రమంగా ఇవ్వలేకపోతోంది. ప్రతి నెలా జీతాల చెల్లింపు ఆలస్యమవుతోంది. వివిధ కార్పొరేషన్ల పేరుతో పెద్దమొత్తంలో ప్రభుత్వం అందినకాడికి అప్పులు గుంజుకొచ్చింది. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనుండడంతో నవరత్నాల అమలు ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ఒకపక్క ఉద్యోగులు దాచుకున్న డబ్బులు కూడా ప్రభుత్వం వాడేసుకుందని, డీఏలు కూడా ఇవ్వడం లేదని ఆరోపిస్తూ సమ్మెకు దిగుతున్నారు. నవరత్నాల అమలుకు అవసరమైన నిధుల సమీకరణకు అప్పులు ఇచ్చే అన్ని ద్వారాలు మూసుకుపోవడంతో రాజధాని నిర్మాణానికి రైతులు ఉచితంగా ఇచ్చిన భూముల అమ్మకానికి తెరతీసింది. అమరావతి నిర్మాణానికి రైతులు సుమారు 34వేల ఎకరాలు భూసమీకరణ పథకం కింద ఇవ్వగా, వాటిలో రైతులకు, రాజధాని నిర్మాణానికిపోను ప్రభుత్వానికి సుమారు 9వేల ఎకరాల భూమి మిగులుతుంది. వాస్తవానికి సీఆర్‌డీఏ చట్టం ప్రకారం ఈ భూమిని రాజధాని అభివృద్ధికి మాత్రమే వినియోగించాలి. దానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆ భూములను అమ్మకానికి పెట్టింది. తొలి విడతగా 14 ఎకరాలు విక్రయించేందుకు నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ-ఆక్షన్ పోర్టల్ ద్వారా వేలం వేసేందుకు ఆఫ్‌సెట్ ప్రైస్ నిర్ణయించాలని గుంటూరు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. ఆ మేరకు అధికారులు నవులూరు గ్రామానికి ఆనుకొని ఉన్న చినకాకాని- గుండుగొలను విజయవాడ వెస్ట్ బైపాస్ వద్ద పదెకరాల భూమి ఎకరం రూ.5,94,50,000గా నిర్ణయించారు. అమరావతి రాజధానిలోని పిచ్చుకలపాలెం గ్రామానికి ఆనుకొని సీడ్ యాక్సెస్ రోడ్డు వద్ద ఉన్న నాలుగు ఎకరాల భూమిని ఒక్కో ఎకరం రూ.5,41,04,400కు విక్రయించేందుకు కమిటీ నిర్ణయం తీసుకుంది. పిచ్చుకలపాలెం వద్ద మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసేందుకు బీఆర్ శెట్టి సంస్థ గతంలో భూమి తీసుకొంది. అప్పట్లో సుమారు రూ.1,200కోట్లకు పైగా పెట్టుబడి పెడతామని హామీ ఇచ్చింది. అయితే అమరావతి రాజధాని నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం నిలిపేయడంతో టీడీపీ ప్రభుత్వంలో ఎంవోయూలు చేసుకొన్న సంస్థలన్నీ వెనకడుగు వేశాయి. గతేడాది పిచ్చుకలపాలెం వద్ద భూమిని విక్రయించేందుకు సీఆర్‌డీఏ ప్రయత్నించింది. అయితే వివిధ కారణాలతో ఆక్షన్ నిలిచిపోయింది. ఇప్పుడు మళ్లీ పిచ్చుకలపాలెంతో పాటు నవులూరు వద్ద మరో పదెకరాలను కూడా ప్రభుత్వం విక్రయానికి పెట్టింది. కోవిడ్ సమయంలోనూ గుంటూరు నగరంలో పీవీకే నాయుడు మార్కెట్, నల్లపాడు, కాకుమానువారి తోటలో భూములు విక్రయించేందుకు ప్రభుత్వం యత్నించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పేదలకు రాజధాని ప్రాంతంలో ఉచితంగా ఇంటి స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. ఇందుకోసం ప్రత్యేక జీవో విడుదల చేసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అప్పట్లో సామాజిక కార్యకర్తలు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా ప్రభుత్వం దివాలా తీసిందా అని హైకోర్టు ప్రశ్నించింది. తర్వాత ఆ భూముల విక్రయం నుంచి ప్రభుత్వం

- మిగతా 2 లో

ఒక భార్యకు 18 మంది భర్తలు

ఇదీ వైసీపీ దొంగ ఓట్ల ప్రహసనం

తిరుపతిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో నారాయణ

విశాలాంధ్ర-తిరుపతి బ్యూరో: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని నగ్నంగా రోడ్డుపై నిలబెట్టి అపహాస్యం చేస్తోందని, జగన్ అరాచక పాలనకు అంతులేకుండా పోతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ధ్వజమెత్తారు. నారాయణ బుధవారం తిరుపతిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఒక్కొక్క ఇంట్లో 30 ఓట్లు, 11 ఓట్లు నమోదు చేసుకున్న పరిస్థితిని పరిశీలించారు. తిరుపతిలోని యశోదనగర్ 18-1- 90/12 నంబరు గల ఖాళీ ప్రదేశంలో 10 దొంగ ఓట్లు, ఒక వలంటీర్ ఇంట్లో 12 దొంగ ఓట్లు, సీపీఎం ఆఫీస్ పక్కన గల లక్ష్మీ ఇంట్లో 8 దొంగఓట్లు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం నారాయణ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజాస్వామ్యాన్ని విస్మరించి రాక్షసపాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటమి భయంతో దొంగఓట్లకు తెరలేపారన్నారు. ద్రౌపదికి ఐదుగురు భర్తని విన్నాం కానీ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఒక మహిళకు 18మంది భర్తలు ఉన్నట్లుగా జగన్ ప్రభుత్వం ఓట్లు నమోదు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. తిరుపతి నగరంలోనే 7 వేల దొంగ ఓట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. దొంగ ఓట్ల నమోదుకు పాల్పడిన అధికారిని ఉరితీయాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా పనిచేసిన ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నియోజకవర్గంలో ఈ దొంగ ఓట్ల దందా కొనసాగడం దుర్మార్గమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అరాచకాలు సృష్టించి దొంగ ఓట్ల ద్వారా గెలవాలని వైసీపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. దొంగ ఓట్లు వేయడానికి వచ్చిన వారిని గుర్తించి కాళ్లు విరగొట్టాలన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థుల విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, ప్రభాకర్, విశ్వనాథ్, శశి, ప్రజాసంఘాల నాయకులు కాలయ్య, నాగరాజ్, బాల, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మురళి, నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జయ, మాధవరెడ్డి, వేణు, బుజ్జి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల తర్వాత

దిల్లీకి మహిళా మంత్రి

అతీషి మర్లేనా, సౌరభ్ భరద్వాజ్‌కు కేబినెట్ పదవులు

న్యూదిల్లీ: దిల్లీ కొత్త మంత్రులుగా విద్యావేత్త అతీషి మర్లేనా, ఆప్ ప్రధాన అధికార ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్ నియామకాన్ని కేంద్ర హోంశాఖ నోటిఫై చేసింది. వారి పేర్లు ప్రకటించిన వారం తర్వాత నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో దశాబ్దం తర్వాత దిల్లీకి ఓ మహిళ మంత్రి లభించినట్లు అయింది. 2013-14లో కేజ్రీవాల్ 49 రోజుల ప్రభుత్వ హయాంలో రాఖీ బిర్లా కేబినెట్ మంత్రిగా ఉన్నారు. ఇప్పటివరకు మరో మహిళకు కేబినెట్ స్థానం దక్కలేదు. 2020లో కేజ్రీవాల్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చినా మహిళలకు కేబినెట్ బెర్తులు ఇవ్వడానికి ఆసక్తి చూపలేదు. అప్పటి ఎన్నికల్లోనే మర్లేనా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్ కేబినెట్‌లో మహిళా మంత్రులు ఉండేవారు. ప్రస్తుతం సత్యేంద్ర జైన్, మనీశ్ సిసోడియా

- మిగతా 2 లో

ఏపీ సెట్ పరీక్షల షెడ్యూలు

మే 15-18 తేదీల్లో ఇంజినీరింగ్

22, 23 తేదీల్లో ఫార్మసీ పరీక్షలు

మే 5న ఈసెట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశాలకు నిర్వహించే ఏపీఈఏపీ సెట్-2023 పరీక్ష తేదీలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. 2023-24 విద్యా సంవత్సరానికిగాను పీజీ, యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ ఉమ్మడి ప్రవేశపరీక్షలను నిర్వహించనుంది. ఏపీ ఈఏపీసెట్‌లో భాగంగా మే 15 నుంచి 18 వరకు ఎంపీసీ స్ట్రీమ్-ఇంజనీరింగ్, మే 22, 23 తేదీల్లో బైపీసీ స్ట్రీమ్-ఫార్మసీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి బుధవారం ప్రకటించింది. ఈఏపీసెట్ దరఖాస్తుకు ఈనెల 11

- మిగతా 2 లో

ఇదీ లోకం!

దిల్లీ లిక్కర్ కుంభకోణం కేసు

కవిత ఈడీ విచారణపై ఉత్కంఠ

- దిల్లీకి రావాలని దర్యాప్తు సంస్థ పిలుపు
- 15న వస్తానన్న బీఆర్ఎస్ మహిళా నేత
- స్పందించని ఈడీ... రాజధానికి పయనం

2లో

దిల్లీలో వెలుగుచూసిన మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పటికే సీబీఐ విచారణకు హాజరైన ఎమ్మెల్సీ కవితకు ఇప్పుడు ఈడీ కూడా నోటీసులు ఇవ్వడంతో ఏం జరగబోతుందన్న దానిపై బీఆర్ఎస్ శ్రేణుల్లో టెన్షన్ మొదలైంది. ఏకకాలంలో విచారణ జరుపుతున్న దర్యాప్తు సంస్థల్లో సీబీఐ కొందరిని ప్రశ్నించడానికి మాత్రమే పరిమితం కాగా... ఈడీ మాత్రం ఇందుకు భిన్నంగా అరెస్టులు చేస్తోంది. దిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా అరెస్టు తర్వాత అందరి దృష్టి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపైనే ఉంది. అరుణ్ పిళ్లై రిమాండ్ రిపోర్ట్ నేపథ్యంలో తాజాగా ఈడీ... దిల్లీలో 9న విచారణకు హాజరు కావాలని కవితకు నోటీసులు ఇవ్వడంతో ఆమె అరెస్టుపై ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే దిల్లీలో దీక్షకు సిద్ధమవుతున్నామని, అది ముగిసిన తర్వాత ఎప్పుడైనా విచారణకు సిద్ధమని కవిత ఈడీకి లేఖ రాశారు. దీనికి ఈడీ నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో ఆమె హుటాహుటిన దిల్లీ పయనమయ్యారు. ఈడీ నోటీసుల నేపథ్యంలో తన కుమార్తెకు కేసీఆర్ ధైర్యం చెప్పారు. ఆందోళన చెందొద్దని, బీజేపీపై న్యాయపరంగా పోరాడదామని ఆయన భరోసా ఇచ్చినట్లు సమాచారం. దిల్లీలో తలపెట్టిన కార్యక్రమాన్ని కొనసాగించాల్సిందిగా కవితకు సూచించారు. మరోవైపు దిల్లీ చేరుకున్న కవిత గురువారం ఈడీ విచారణకు హాజరవుతారా? లేదా? అనే విషయంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

2లో

పోలవరంలో అగాధాలు పూడ్చే పనులు ప్రారంభం

ఐదు రోజుల్లో నివేదికివ్వాలి

- ధాకా భవనంలో పేలుడుపై దర్యాప్తు కమిటీకి హోంమంత్రి ఆదేశాలు
- రెండోరోజు కొనసాగిన సహాయక చర్యలు

ధాకా: బంగ్లాదేశ్ రాజధాని ధాకాలో ఓ భవనంలో సంభవించిన పేలుడు 17 మంది ప్రాణాలు తీయగా మరో 100 మందికిపైగా గాయపడ్డారు. పాత ధాకా గులిస్థాన్‌లోగల సిద్దిఖ్ బజార్ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం 4.50 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) శక్తిమంతమైన పేలుడు సంభవించింది. ఈ ఘటనపై సముచిత నిపుణులతో దర్యాప్తు చేపట్టనున్నట్లు బంగ్లాదేశ్ హోంమంత్రి అసదుజ్జమన్ ఖాన్ తెలిపారు. బుధవారం ఘటనాస్థలిని సందర్శించిన ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. బాంబు నిర్వీర్యం చేసే దళాలు, పోలీసులు, సైన్యం, అగ్నిమాపక సిబ్బంది ఈ ఘటనపై దర్యాప్తు చేపడతాయని చెప్పారు. దేశీయ దర్యాప్తు విఫలమైతే విదేశీ నిపుణుల సహాయాన్ని కోరతామని ఆయన తెలిపారు. దర్యాప్తు నిష్పాక్షికంగా జరుగుతుందని, వివక్షకు తావులేదన్నారు. దర్యాప్తు వివరాలు బహిరంగపరుస్తామని చెప్పారు. నలుగురు సభ్యులతో కూడిన దర్యాప్తు బృందానికి అగ్నిమాపక సేవలు, పౌర రక్షణ డైరెక్టర్ లెఫ్టినెంట్ కల్నల్ మహమ్మద్ తజుల్ ఇస్లాం చౌదరి నేతృత్వం వహిస్తారన్నారు. ఈ కమిటీ ఐదు రోజుల్లో నివేదికను సమర్పిస్తుందని అధికారులు తెలిపారు. గాయపడిన వారిలో 11 మంది షేక్ హసీనా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బర్న్, ప్లాస్టిక్ సర్జరీలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. బుధవారం రెండవ రోజు సహాయక చర్యలను అగ్నిమాపక దళ సభ్యులు చేపట్టారు. భవనం శిథిలావస్థకు చేరిన క్రమంలో సహాయక చర్యలు నత్తనడకన సాగుతున్నట్లు తెలుస్తోంది. భవనం పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు ధాకా పోలీసులు తెలిపారు. అది ఏ క్షణంలోనైనా కూలిపోవచ్చునన్నారు. కాగా, 17 మంది మృతదేహాలను వారి కుటుంబాలకు బుధవారం అధికారులు అప్పగించారని ధాకా వైద్య కళాశాల, ఆసుపత్రి పోలీసు అవుట్‌పోస్టు ఇంచార్జి ఇనస్పెక్టర్ బచ్చు మియా తెలిపారు. అయితే చాలా మంది మెదడులో రక్తస్రావం వల్లనే చనిపోయారని బంగ్లాదేశ్ వైద్యశాఖ మంత్రి జాహిద్ మలేక్ తెలిపారు.

జెలెన్‌స్కీని కలిసిన గుటెర్రస్

ధాన్యం ఎగుమతిపై చర్చ

ఐరాస: ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ బుధవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్‌స్కీతో ఆ దేశ రాజధాని కీవ్‌లో భేటీ అయ్యారు. పోలండ్ నుంచి ఆయన ఉక్రెయిన్‌కు చేరుకున్నట్లు గుటెర్రస్ అధికార ప్రతినిధి స్టిఫనే దుజర్రిక్ ఓ ప్రకటనలో తెలిపారు. బ్లాక్ సీ గ్రెయిన్ పథకంపై జెలెన్‌స్కీతో ఆయన చర్చించినట్లు వెల్లడించారు. 2022, జులై 22న రష్యా, ఉక్రెయిన్ వేర్వేరుగా టర్కీలోని ఇస్తాంబుల్‌లో ఐరాసతో కలిసి ధన్యం, ఎరువులను ఉక్రెయిన్, రష్యా నుంచి ఎగుమతి చేసేందుకు ఒప్పందాలు చేసుకున్నాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం క్రమంలో అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరాకు హామీనిచ్చే విధంగా ఈ ఒప్పందాలు జరిగాయి. 2022, నవంబరు 19వ తేదీతో ఈ ఒప్పందం గడువు ముగియగా దానిని మరో 120 రోజులు పొడిగించారు. దీనిని మరింత పొడిగించాలని గుటెర్రస్ పదేపదే పిలుపునిచ్చారు. తాజాగా ఉక్రెయిన్ పర్యటన క్రమంలో ఆయన జెలెన్‌స్కీతో ఇతర అంశాలపైనా చర్చించినట్లు ప్రకటన పేర్కొంది. గుటెర్రస్ గురువారం న్యూయార్క్‌కు చేరుకుంటారని తెలిపింది.

ఇక రష్యాను అడ్డులేనట్లే..!: బక్ముత్ నగరాన్ని ఆక్రమిస్తే.. తూర్పు ఉక్రెయిన్‌లోని కీలక నగరాల్లో దూసుకెళ్లడానికి రష్యాకు అడ్డు ఉండదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పినట్లు అమెరికా మీడియా పేర్కొంది. 'బక్ముత్ తర్వాత రష్యా బలగాలు ఇతర ప్రాంతాల్లోకి దూసుకెళ్లగలవని అర్థమైంది. దొనెట్స్క్ దిశగా బక్ముత్ నుంచి ఇతర నగరాలకు వెళ్లడం వారికి సులువవుతుంది. బక్ముత్‌లో అంతా నాశనం చేసి, ప్రజలందరిని చంపేసి దానిని దక్కించుకోవాలనుకుంటోంది' అని జెలెన్‌స్కీ అన్నారు. రష్యా -ఉక్రెయిన్ మధ్య ఏడాదిగా యుద్ధం కొనసాగుతోంది.

అక్రమ వలసల కట్టడికి బ్రిటన్‌లో కొత్త చట్టం

లండన్: బ్రిటన్‌లోకి అక్రమంగా ప్రవేశించే వారిని ఆశ్రయం పొందేందుకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని ఆ దేశ ప్రధాని రిషి సునాక్ తేల్చిచెప్పారు. అక్రమ వలసల కట్టడికి కొత్త చట్టాన్ని తెచ్చారు. బ్రిటన్‌లో చొరబాట్లకు తావులేదని సునాక్ ట్విట్టర్‌లో వెల్లడించారు. అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తే అదుపులోకి తీసుకొని, తిరిగి పంపిస్తామన్నారు. సొంత దేశంలో వారికి ప్రమాదం ఉందని తెలిస్తే మరో దేశానికి తరలిస్తామని ట్వీట్‌లో పేర్కొన్నారు. అమెరికా, ఆస్ట్రేలియాలో ఉన్నాసరే మా దేశంలోకి మళ్లీ ప్రవేశించకుండా నిషేధిస్తామని హెచ్చరించారు. ఇంగ్లీష్ ఛానల్ గుండా చిన్న పడవల్లో అక్రమంగా ప్రవేశించే వాళ్లపై బ్రిటన్ ప్రత్యేకంగా దృష్టిసారించనుంది. గతేడాది సౌతీస్ట్ ఇంగ్లండ్ గుండా 45 వేలమంది బ్రిటన్‌కు చేరుకున్నారు. ఐదేళ్లలతో పోల్చితే వలసలు వార్షికంగా 60 శాతం పెరిగినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అయితే సునాక్ తాజా నిర్ణయంపై మానవ హక్కుల సంఘాలు, బ్రిటన్‌లోని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కొత్త చట్టంపై అంతర్జాతీయ సమాజం నుంచి అభ్యంతరం వ్యక్తం కావొచ్చని ప్రధాన ప్రతిపక్షం లేబర్ పార్టీ పేర్కొంది. అది అమలయ్యే అవకాశం లేదని తెలిపింది. ఈ చట్టంతో దుర్బల పరిస్థితుల్లో ఉన్న శరణార్థులు బలి పశువులు అవుతారంటూ మానవహక్కుల సంఘాలు పేర్కొన్నాయి. యూరోపియన్ మానవ హక్కుల చట్టంలోని ఇతర హక్కులను తుంగలో తొక్కారని విమర్శించాయి. కొత్త చట్టం అక్రమ వలసలపై ఉక్కుపాద విధానమని బ్రిటన్ హోం మంత్రి, భారత సంతతికి చెందిన సుయెల్లా బ్రేవర్‌మాన్ ఓ ప్రకటనలో తెలిపారు.

పదేళ్ల తర్వాత దిల్లీకి మహిళా మంత్రి

(మొదటిపేజీ తరువాయి)

అవినీతి ఆరోపణల కారణంగా గత వారం తమ మంత్రి పదవులకు రాజీనామా చేశారు. దీంతో మర్లేనా, భరద్వాజ్‌కు ఆ పదవులు వరించాయి. ఇదిలావుంటే సిసోడియాకి ఎనిమిది రోజుల సీబీసీ కస్టడీ తర్వాత పక్షం రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించారు. ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తన హోలీ సందేశంలో సిసోడియా అంశాన్నే ప్రస్తావించారు. మనీశ్ సిసోడియా, సత్యేంద్ర జైన్ వంటి దేశభక్తులు, విద్య-ఆరోగ్య సంస్కర్తలను శిక్షించి... లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోచుకునేవారిని అక్కునచేర్చుకునే ప్రధాని ఉన్న దేశం మనదని వ్యాఖ్యానించారు. ప్రధాని చేస్తున్నది తప్పని... దేశం తప్పుదోవ పడుతోందని మీకూ అనిపిస్తే దయచేసి హోలీ వేడుకల తర్వాత కొంత సమయం తీసి దేశ శ్రేయస్సు కోసం నాతో పాటు ధాన్యం, ప్రార్థనలు చేయండని దిల్లీ ప్రజలను ముఖ్యమంత్రి కోరారు. దిల్లీ ఉప ముఖ్యమంత్రిగా సిసోడియా దిల్లీ ప్రభుత్వ బాధ్యతలు చూసుకోవడంతో కేజ్రీవాల్ తన దృష్టిని పార్టీ విస్తరణపైనే పెట్టారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. సిసోడియా కటకటాల పాలయ్యారు. దీంతో ఆప్‌కు పెద్ద షాక్ తగిలింది. ఆ వెంటనే బెంగళూరు మాజీ పోలీసు కమిషనర్ భాస్కర్ రావు పార్టీ ఫిరాయించి బీజేపీ గూటికి చేరారు. ఇక కొత్త మంత్రుల ఎంపికలోనూ గందరగోళం నెలకొంది. విద్యామంత్రిగా ఉన్న సిసోడియాకు మద్దతు తెలుపుతూ స్కూలు పిల్లలతో లేఖలు రాయించినట్లు ఆప్‌పై కేసు కూడా ఉంది. ఏదిఏమైనా ఆప్‌కు కాంగ్రెస్ మినహా విపక్ష పార్టీల మద్దతు లభించింది. ఆప్ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు మద్యం విధానంపై కాంగ్రెస్ పార్టీయే మొదట ప్రచారం చేసింది.

చైనాను తొక్కేసే యత్నాల్లో పశ్చిమ దేశాలు

అమెరికా ప్రోద్బలంతోనే: జిన్‌పింగ్

బీజింగ్: తమ దేశాన్ని అణచివేసే దిశగా అమెరికా ప్రోద్బలంతో పశ్చిమ దేశాలు చకాచకా అడుగులు వేస్తున్నాయని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆరోపించారు. తమ దేశాభివృద్ధికి అడ్డంగులు సృష్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. వాణిజ్య యుద్ధం కొనసాగుతుండగా చైనా టెక్ దిగ్గజం హువేయిని తొక్కేయాలని అమెరికా అన్ని ప్రయత్నాలు చేస్తున్నదని జిన్‌పింగ్ అన్నట్లు ఈ మేరకు సౌత్‌చైనా మార్నింగ్ పోస్టు తెలిపింది. డేటా గోప్యత నెపంతో టిక్‌టాక్‌పై అమెరికా నిషేధం విధించింది. చైనా వార్షిక పార్లమెంటరీ సమావేశాల్లో భాగంగా జరిగిన చర్చల్లో జిన్‌పింగ్ మాట్లాడుతూ పశ్చిమ దేశాల తీరును ఖండించారు.

అమెరికాపై విమర్శలు చేశారు. తమ దేశ అభివృద్ధిపై బాహ్య ఒత్తిడి ఎక్కువైందని, ఫలితంగా సవాళ్లు పెరిగి భవిష్యత్ అగమ్యగోచరమవుతోందన్నారు. అంతర్జాతీయంగానే కాకుండా దేశీయంగా మారుతున్న వాతావరణం నేపథ్య సంక్లిష్ట సవాళ్లను కలిసికట్టుగా ఎదుర్కోవాలని అన్నారు. ఓర్పుగా ఏకాగ్రతతో సుస్థిరత, పురోగతికి సంకల్పించాలని సూచించారు. ఐక్యంగా ఉండటమే కాకుండా అవసరమైతే పోరునకూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

టెక్నాలజీలో స్వీయసమృద్ధి కోసం పటిష్ఠ చర్యలు అవస్యమని జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. ఇదిలావుంటే ఇండో-పసిఫిక్ వ్యూహం ద్వారా చైనా ముట్టడికి అమెరికా యత్నిస్తోందని చైనా విదేశాంగ మంత్రి ఆరోపించారు. ప్రత్యేక బ్లాకులను ఏర్పాటు చేసి ఘర్షణలను రెచ్చగొట్టి, ప్రాంతీయ సమగ్రతకు విఘాతం కలిగించాలని చూస్తోందన్నారు. నాటోకు ఆసియా-పసిఫిక్ వర్షన్‌ను సృష్టించే యోచనలో అమెరికా ఉన్నట్లు వెల్లడించారు.

కవిత ఈడీ విచారణపై ఉత్కంఠ

విశాలాంధ్ర-హైదరాబాద్: దిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో విచారణకు హాజరు కావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవితకు ఈడీ నుంచి నోటీసులు అందాయి. మార్చి 9న దిల్లీలో విచారణకు రావాలని నోటీసులో ఈడీ పేర్కొంది. అయితే తనకు ఇతర కార్యక్రమాలున్నందున 15వ తేదీన విచారణకు వస్తానని ఈడీ అధికారులకు కవిత లేఖ పంపారు. కానీ కవిత అభ్యర్థనపై ఈడీ నుంచి ఎలాంటి సమాధానం వెలువడలేదు. దీనిపై బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కవిత కోరినట్లు 15న ఈడీ విచారణకు అనుమతిస్తుందా? 9,15 తేదీల్లో కాకుండా మరోరోజు పిలుస్తుందా? అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈడీ నుంచి వచ్చే సమాధానాన్ని బట్టి దిల్లీకి బయల్దేరాలని మొదట కవిత భావించారు. అయితే ఈడీకి లేఖ రాసి గంటలు గడుస్తున్నా ఎలాంటి సమాధానం లేకపోవడంతో ముందుగా అనుకున్నట్లుగా షెడ్యూల్ ప్రకారమే కవిత బుధవారం సాయంత్రం దిల్లీకి బయల్దేరారు. ఆమెతో పాటు కొంతమంది బీఆర్ఎస్ నాయకులు కూడా ఉన్నారు. అంతకుముందు ప్రగతిభవన్‌కు వెళ్లిన ఆమె... తన తండ్రి, ముఖ్యమంత్రి కేసీఆర్‌తో భేటీ అవ్వాలని భావించినప్పటికీ వీలుపడలేదు. దీంతో కవితకు ఫోన్ చేసిన కేసీఆర్...సుమారు 15 నిమిషాలపాటు ఈడీ నోటీసులు, న్యాయ సలహాలపై చర్చించాక కవిత దిల్లీకి వెళ్లానే నిర్ణయం తీసుకున్నారని తెలిసింది.

బీజేపీ అకృత్యాలపై పోరాదదాం...

'దిల్లీలో నువ్వు చేపట్టిన నీ కార్యక్రమం కొనసాగించు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. న్యాయపరంగా బీజేపీ అకృతాలపై పోరాడుదాం. పార్టీ అండగా ఉంటుంది' అని కవితకు కేసీఆర్ ధైర్యం చెప్పినట్లు తెలిసింది.

మహిళా రిజర్వేషన్ల కోసం దిల్లీలో ఒకరోజు నిరాహారదీక్ష

మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు మహిళా సంఘాలతో కలిసి భారత్ జాగృతి మార్చి-10న జంతర్ మంతర్ వద్ద ఒకరోజు నిరాహార దీక్ష తలపెట్టింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ కవితే దగ్గరుండి చూస్తున్నారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి దీక్షను ప్రారంభించనుండగా, ముగింపు కార్యక్రమానికి సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరు కానున్నారు. వీరు కాక దీక్షా కార్యక్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు పాల్గొంటారు. కవిత దీక్షకు జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మద్దతు తెలిపారు. కవిత దీక్షకు సంఘీభావంగా దేశంలోని 18 పార్టీల నేతలు, ఆయా పార్టీల బృందాలు పాల్గొననున్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వివిధ మహిళా సంఘాలు, మహిళా హక్కుల కోసం పోరాడుతున్న సంస్థలు దీక్షలో పాల్గొనబోతున్నాయి. ముఖ్యంగా కవిత చేపట్టిన ఈ దీక్షకు రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ప్రత్యేకంగా హాజరుకానున్నారు.

దర్యాప్తు సంస్థలకు పూర్తి సహకారం: కవిత

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జారీ చేసిన నోటీసులపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్పందించారు. చట్టాన్ని గౌరవించే పౌరురాలిగా నేను దర్యాప్తు సంస్థలకు పూర్తిస్థాయిలో సహకరిస్తాను. కానీ నిరాహారదీక్ష, ముందస్తు అపాయింట్‌మెంట్ల రీత్యా విచారణకు హాజరయ్యే తేదీపై న్యాయ సలహా తీసుకుంటాను అని కవిత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయ రంగంలో మహిళలకు తగిన ప్రాతినిథ్యం కల్పించడానికి సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలన్నది మా డిమాండ్ అని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు మహిళా సంఘాలతో కలిసి భారత్ జాగృతి ఈ నెల 10న జంతర్ మంతర్ వద్ద ఒకరోజు నిరాహార దీక్షను తలపెట్టిందని కవిత తెలిపారు. ఈ క్రమంలోనే మార్చి 9న దిల్లీలో విచారణకు రావాల్సిందిగా ఈడీ నాకు నోటీసులు జారీ చేసిందన్నారు. ఇలాంటి చర్యలతో సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని లొంగ తీసుకోవడం కుదరదని బీజేపీ తెలుసుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని, దేశ అభ్యున్నతి కోసం గొంతెత్తుతామని పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి తెలంగాణ ఎప్పటికీ తలవంచబోదని దిల్లీలో ఉన్న అధికారకాంక్ష పరులకు గుర్తుచేశారు. ప్రజల హక్కుల కోసం ధైర్యంగా పోరాటం చేస్తామని కవిత స్పష్టం చేశారు.

కవిత ఇంటి వద్ద భారీగా పోలీసుల మోహరింపు

ఈడీ నోటీసుల నేపథ్యంలో కవిత ఇంటి ముందు పోలీసులు భారీగా మోహరించారు. కవిత ఇంటికి వెళ్లే దారులన్నీ మూసివేశారు. మార్చి 7న రామచంద్ర పిళ్లైని అరెస్ట్ చేసిన ఈడీ అధికారులు రిమాండ్ రిపోర్టులో కవిత పేరు ప్రస్తావించారు. ఈ కేసులో ఇప్పటివరకూ ఈ కేసులో 11 మంది అరెస్ట్ చేయడం జరిగింది. అయితే మార్చి 9వ తేదీన దిల్లీలోని ఈడీ ఆఫీస్ కు విచారణను రావాలని కవిత కు నోటీసులు ఇవ్వడం జరిగింది. అరుణ్ రామచంద్ర పిళ్లై... తను కవిత బినామీ అని ఒప్పుకునట్టు ఈడీ వెల్లడించింది.

ఈ నేపథ్యంలో బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లోని కవిత ఇంటికి వెళ్లే మార్గాలను మూసివేసి ఆమె ఇంటి వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

పోలవరంలో అగాధాలు పూడ్చే పనులు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : పోలవరం ప్రాజెక్టులోని గ్యాప్1, 2ల్లో గతంలో గోదావరి వరదల వల్ల ఏర్పడిన అగాథాలను పూడ్చే ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్ (డీడీఆర్పీ) ఆమోదించిన డిజైన్ ప్రకారం ఈ పనులు ప్రారంభమయ్యాయి. జలవనరుల శాఖ ఎస్ఈ నరసింహామూర్తి, ఈఈలు మల్లికార్జున రావు, పాండురంగయ్య, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) సీజీఎంఎం ముద్దు కృష్ణ, జనరల్ మేనేజర్ గంగాధర్, అసోసియేట్ జనరల్ మేనేజర్ మురళి పమ్మి కలిసి గ్యాప్ 1,2లలో పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. రెండు ప్రాంతాల్లో ఏర్పడిన అగాథాలను పూడ్చటంలో భాగంగా ఇసుకను అక్కడ డోజర్ల ద్వారా నింపుతున్నారు. ఇసుకను నింపిన తరువాత వైబ్రో క్యాంపక్షన్ విధానం ద్వారా ఆ ప్రాంతాన్ని గట్టిపరుస్తారు. ఇది పూర్తైన తరువాత నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) దయాఫ్రామ్ వాల్ పటిష్టతపై ఇచ్చిన నివేదిక ఆధారంగా డీడీఆర్పీ ఆమోదం పొందాక సంబంధిత పనులు చేపడతారు. దయాఫ్రామ్ వాల్ పనులు పూర్తైన తరువాత ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) పనులు ప్రారంభమవుతాయి.

ఏపీ సెట్ పరీక్షల షెడ్యూలు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి వచ్చే నెల 15 వరకు గడువు ఇచ్చింది. మే 5న ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఈసెట్) నిర్వహించనుండగా, దరఖాస్తుకు మార్చి 10 నుంచి ఏప్రిల్ 10 వరకు అవకాశం కల్పించింది. ఎంబీఏ/ఎంసీఏలో ప్రవేశాల కోసం నిర్వహించే ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఐసెట్) పరీక్షలను మే 24, 25 తేదీల్లో ఖరారు చేయగా, వాటి కోసం దరఖాస్తుకు ఈనెల 20 నుంచి ఏప్రిల్ 19 వరకు గడువు ఇచ్చింది. ఈఏపీసెట్‌కు ఈనెల 10న, ఈసెట్‌కు 8న, ఐసెట్‌కు 17న ప్రవేశ ప్రకటనలు జారీచేస్తారు. ఉమ్మడి ప్రవేశ పరీక్షలన్నీ ఆన్‌లైన్లో నిర్వహిస్తారు. పరీక్షల తేదీలు, పరీక్ష రుసుం వివరాలను ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లో ఉంచారు. వరుస వారీగా అన్ని పరీక్షలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తేదీలను నిర్ణయించారు. ఇప్పటికే తెలంగాణలో ఉమ్మడి ప్రవేశ పరీక్షల తేదీలను వెల్లడించగా, ఏపీలో ఆలస్యంగా ప్రకటించారు. దీనివల్ల ప్రవేశాలు మరింత జాప్యమయ్యే అవకాశముంది. గతేడాది ఉమ్మడి ప్రవేశాల జాప్యంతో వివిధ రాష్ట్రాలకు ఇంజనీరింగ్ కోర్సుల నిమిత్తం విద్యార్థులు వలసలు వెళ్లిపోయారు. దీనిప్రభావంతో ఇంజనీరింగ్ సీట్లు మిగిలిపోయాయి.

అమరావతి భూములపై కన్ను

(మొదటిపేజీ తరువాయి)

వెనక్కు తగ్గింది. ఉగాది నాటికి ఎట్టిపరిస్థితుల్లో పరిపాలనా రాజధాని విశాఖకు మార్చాలన్న ధ్యేయంతో ఉన్న ప్రభుత్వం...ఈలోగా అమరావతి రాజధాని భూములు తెగనమ్మేందుకు కసరత్తు నిర్వహిస్తోంది. అమరావతి రాజధాని విధ్వంసానికి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రపూరిత చర్యలపై రైతులు మండిపడుతున్నారు. రాజధాని నిర్మాణపనులను అర్ధాంతరంగా నిలిపివేసిన ఈ ప్రభుత్వానికి రైతులిచ్చిన భూములు అమ్మే హక్కు ఎక్కడుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా కుత్సిత రాజకీయాలకు స్వస్తి పలికి అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించి ఆగిన అభివృద్ధి పనులను పున:ప్రారంభించాలని, లేనిపక్షంలో తగిన గుణపాఠం తప్పదని రైతులు హెచ్చరిస్తున్నారు.

స్మార్ట్ మీటర్లు ఉపసంహరించాలి : సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లు బిగించడం వల్ల ప్రయోజనం ఏమీలేదని ప్రయాస్ ఎనర్జీ గ్రూప్ నివేదిక తేల్చి చెప్పిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలన్నారు. విద్యుత్ ఆదా లేకపోగా, ప్రజాధనం వృథా అవుతోందని ప్రయాస్ రిపోర్టు పేర్కొందన్న విషయం మీడియా ద్వారా వెల్లడైందని, చాలా మంది విద్యుత్ నిపుణులు ఇంతకుముందే ఈ విషయం స్పష్టం చేశారన్నారు. ప్రయాస్ వారు తీసుకున్న ప్రాతిపదికలు సరికావని ప్రభుత్వం బుకాయించడం దారుణమని, ప్రయాస్ గ్రూప్ పూర్తి నివేదికను ప్రభుత్వం ఇప్పటికైనా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రూ.6,500 కోట్లు ఖర్చు చేసి వ్యవసాయ పంప్‌సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఇప్పటికైనా ఉపసంహరించుకోవాలని, ప్రజా ధనాన్ని స్మార్ట్ మీటర్ తయారీదార్లకు, సాఫ్ట్‌వేర్ సర్వీసులు అందించే కార్పొరేట్లకు కట్టబెట్టడం తగదన్నారు.

వైద్యరంగంలో అణగారిన వర్గాలకు జగన్ బాటలు

వైసీపీ బీసీ నేత నాగరాధాకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో కొత్తగా వచ్చిన మెడికల్, డెంటల్ పీజీ సీట్లలో 50 శాతం హక్కుగా పొందగలిగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు, వారి కుటుంబాల ఆర్థిక-సామాజిక అభివృద్ధికి సీఎం జగన్ బాటలు వేశారని వైసీపీ బీసీ నేత, డాక్టర్ సెల్ నాయకులు డాక్టర్ అంబటి నాగరాధాకృష్ణ యాదవ్ కొనియాడారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా 630 మెడికల్ పీజీ సీట్లకు అనుమతులు దక్కించుకోవడం చరిత్రలో నిలిచిపోయే అంశమని తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కనీసం ఊహించలేని తరహా ఘన విజయానికి జగన్ నాంది పలికారన్నారు. ఇందులో 50శాతం సీట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు దక్కనున్నాయని తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ దంత కళాశాలకు 15 పీజీ సీట్లకు డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా అనుమతులు లభించడం హర్షనీయమన్నారు. ఒక్కసారిగా ఇన్ని సీట్లు రావడం కళాశాల చరిత్రలో లేదని, దానికోసం విశేషంగా పాటుపడిన జగన్ ప్రభుత్వానికి, అధికారులకు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాసరావుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. దూరదృష్టితో అహర్నిశలు శ్రమిస్తూ వైద్యవిద్యపై దృష్టిసారించి విజయకేతనాన్ని ఎగరవేస్తున్న సీఎంకు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు రుణపడి ఉంటారని పేర్కొన్నారు.

ఉద్యమం యథాతథం

(మొదటిపేజీ తరువాయి)

చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అన్నిటిపైనా లిఖిత పూర్వకంగా మినిట్ల ద్వారా తెలియజేయాలని ఏపీ జేఏసీ అమరావతి అల్టిమేటం జారీజేసింది. దానిపై రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసుకుని, చర్చించుకుని, ఉద్యమ కార్యాచరణ కొనసాగింపుపై నిర్ణయిస్తారు. ఈనెల 7వ తేదీ రాత్రి జరిగిన చర్చలు సానుకూలంగా జరిగినందున, ఉద్యమ కార్యాచరణ కొనసాగింపు నిలిపివేయాలని ఏపీ జేఏసీ నేతలను మంత్రులు కోరారు. దానిపై ఏపీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు అధ్వర్యంలో సీఎస్‌ను కలవగా, వారికి భరోసా ఇచ్చారు.

ఉద్యమం కొనసాగింపుపై నేడు నిర్ణయం

విజయవాడ రెవెన్యూ భవన్‌లో గురువారం జరగబోయే రాష్ట్ర అత్యవసర కార్యవర్గ సమావేశంలో ప్రభుత్వం ఈనెల 7వ తేదీన ప్రకటించిన అంశాలు, మినిట్లలో పొందుపరచే అంశాలపై చర్చించి ఉద్యమ కార్యచరణ కొనసాగింపుపై నిర్ణయిస్తామని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, కోశాధికారి వీవీ మురళికృష్ణ నాయుడు, బి.కిషోర్ కుమార్, దొప్పలపూడి ఈశ్వర్, కనపర్తి సంగీతరావు, ఎస్.మల్లీశ్వరరావు, ఎ.సాంబశివ రావు తదితరులు తెలిపారు. సీఎస్‌ను కలిసిన అనంతరం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం వద్ద నేతలు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. చర్చల మినిట్ల ప్రతులను తమకు ఇవ్వకుంటే ఉద్యమం యథాతథంగా ఉంటుందని, వెనక్కి తగ్గబోమని పునరుద్ఘాటించారు.

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

జనసేన అధినేత పవన్ కల్యాణ్ డిమాండ్



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : 'శక్తి స్వరూపిణి స్త్రీ.. బహుకృత రూపిణి స్త్రీ.. బహుముఖ ప్రజ్ఞాశాలి స్త్రీ.. మానవ సృష్టికి మూలకారిణి స్త్రీ.. ఇంతటి మహోన్నతమైన స్త్రీకి మనం ఏమిచ్చినా రుణం తీరదు' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. తల్లిగా.. తోబుట్టువుగా.. భార్యగా.. బిడ్డగా.. భిన్నరూపాలలో మన మధ్య ఉన్న స్త్రీమూర్తి సేవలు వెలకట్టలేనివి. మహిళామణి లేని ఇల్లు దీపంలేని కోవెల వంటిది. ఇంతటి మహత్తరమైన వనితాలోకానికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు. ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని చెప్పుకొంటాం. అది సత్యం. స్త్రీలను గౌరవించే చోట శాంతిసౌభాగ్యాలు విరసిల్లుతాయని విశ్వసిస్తా. స్త్రీ సంపూర్ణ సాధికారిత సాధించడానికి, స్వేచ్ఛగా జీవించడానికి సమాజం, ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలి. మహిళలపై అఘాయిత్యాలు జరగని సమాజం ఆవిష్కృతం కావడానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలి. స్త్రీ ఆర్థిక స్వావలంబనతో స్వశక్తిపై నిలబడలన్నా, సాధికారిత సాధించాలన్నా చట్టసభలలో వారి సంఖ్యాబలం పెరగాలని నేను నమ్ముతా' అని పవన్ అన్నారు. చట్టసభలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

పథకాల మాటున మహిళలకు జగన్ టోకరా

మాజీ మంత్రి పరిటాల సునీత



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : దశాబ్దాల అణిచివేతపై అలుపెరుగని పోరాటం చేసి సాధించుకున్న మహిళా దినోత్సవ మూలాలు జగన్‌మోహన్ రెడ్డి అసమర్థ పాలన, ఉదాసీన వైఖరితో కనుమరుగవుతున్నాయని మాజీ మంత్రి పరిటాల సునీత విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి పథకాల పేరుతో వారిని దగా చేస్తుందని బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అత్యాచారాలకు కేరాఫ్‌గా రాష్ట్రాన్ని మార్చేసిన జగన్‌కు మహిళల పేరు ఉచ్ఛరించే అర్హత లేదన్నారు. సీఎం నివసించే తాడేపల్లిలో వరుస అత్యాచారాలు జరుగుతున్నా, గంజాయి యథేచ్ఛగా లభిస్తున్నా తనకేం పట్టనట్టు వ్యవహరించడం మహిళా రక్షణపై జగన్ రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. దేశంలో మహిళలపై నేరాలలో మూడో వంతు ఏపీలోనే జరగడం ప్రభుత్వ శాంతిభద్రతల వైఫల్యానికి నిదర్శనమన్నారు. దిశా చట్టం, దిశా యాప్, దిశా పోలీస్ స్టేషన్ల అంటూ ప్రచారార్భాటం చేస్తున్న ముఖ్యమంత్రి ఒక్క ఆడబిడ్డను కూడా కిరాతకుల నుంచి కాపాడలేదన్నారు. మహిళా సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం లక్ష కోట్లకుపైగా ఖర్చు చేస్తే జగన్ గృహ నిర్మాణం పేరుతో మహిళల నుంచి లక్షకోట్లు దోచేస్తున్నారన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు చంద్రబాబు స్థాపించిన డ్వాక్రా సంఘాలను జగన్ తన అసమర్థతతో ప్రశ్నార్థకం చేశారని, అభయహస్తం నిధులను కొల్లగొట్టారని, ఆసరా పేరుతో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని టోకరా వేశారని విమర్శించారు. నాసిరకం మద్యంతో మహిళల మాంగల్యాలు తెంచుతున్నారని, నాలుగేళ్లుగా పెళ్లికానుకలకు ఎగనామం పెట్టడంతోపాటు నిత్యావసర ధరలు పెంపు, పన్నుల మోతతో మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారం వేశారని సునీత ఆగ్రహం వ్యక్తంచేశారు.

అగ్రిగోల్డ్ బాధితుల కోసం

బడ్జెట్‌లో రూ.3వేల కోట్లు కేటాయించాలి

- అమ్మిన ఆస్తులు తిరిగి స్వాధీనం చేసుకోవాలి
- మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు ఇవ్వాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అగ్రిగోల్డ్ బాధితుల కోసం రూ.3వేల కోట్లు కేటాయించాలని, యాజమాన్యం అక్రమంగా అమ్మిన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఏపీ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. విజయవాడ దాసరిభవన్‌లో బుధవారం ఆయన అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖరరావు, కార్యవర్గ సభ్యులు అగస్టీన్‌తో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ, యాజమాన్యం బినామీ ఆస్తులను, అటాచ్డ్ ఆస్తులను అమ్ముకుంటోందని, ఆ ఆస్తుల రిజిస్ట్రేషన్లను రద్దుచేసి వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణమే న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ సమస్య మూడు నెలల్లో పరిష్కారం కానిపక్షంలో జూన్ నుంచి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని, ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని ముప్పాళ్ల హెచ్చరించారు. ఇప్పటివరకు దీనిని రాజకీయ పోరాటం కాకుండా, బాధితులకు న్యాయం చేసే ఉద్యమంగా నడిపించాం. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో సమస్యకు పరిష్కారం చూపండి. ఇదే అంశమై సీఎం జగన్‌ను కలిసి వాస్తవాలను వివరించేందుకు ప్రయత్నిస్తాం. ఇందుకు ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సహకారాన్ని కోరుతున్నాం' అని ముప్పాళ్ల అన్నారు. ఏలూరులోని డిపాజిట్ రక్షణ చట్టంపై ఉన్న ప్రత్యేక కోర్టులో అగ్రిగోల్డ్‌కు చెందిన ఒకే అంశంపై రోజువారీ విచారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. యాజమాన్యం అధీనంలోని ఆస్తుల వేలానికి ప్రత్యేక ఎస్‌పీవీ(స్పెషల్ పర్పస్ వెహికల్) నియమించి, నిబద్ధతగల అధికారికి బాధ్యతలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ విభాగాలకు అవసరమైన భూములు, భవనాలను ఇందులో నుంచి సేకరించాలన్నారు. యుద్ధప్రాతిపదికన బాధితులను ఆదుకోకుంటే ఆత్మహత్యలు పెరిగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తంచేశారు.

జగన్ పాదయాత్ర చేసినప్పుడు అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఆత్మహత్యలకు, అసహజ మరణాలకు పాల్పడిన బాధిత కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల న్యాయమైన డిమాండ్ల విషయంలో సీఎం జగన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈనెల 15,16 తేదీల్లో విజయవాడ ధర్నాచౌక్‌లో రిలే దీక్షలు, 17న సామూహిక సత్యాగ్రహం నిర్వహించాలని అసోసియేషన్ నిర్ణయించిందని ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. 'అధికారంలోకి వచ్చిన వారంలో రూ.1183కోట్లు కేటాయించి 14లక్షల మందికి న్యాయం చేస్తానని అప్పట్లో జరిగిన అసోసియేషన్ సభలో ఉద్ఘాటించారు. కంపెనీ దుర్మార్గాన్ని తేలుస్తానన్నారు. నన్ను నమ్మండని చెప్పారు. అధికారంలోకి వచ్చాక అగ్రిగోల్డ్ సమస్యనే మరిచారు. వారి డిమాండ్ల పరిష్కారాన్ని నిర్లక్ష్యం చేశారు. డిపాజిట్‌దారులకు న్యాయం చేస్తానన్న హామీని నిలబెట్టుకోలేదు. చనిపోయిన వారి కుటుంబాలకు నష్టపరిహారంపై నోరు మెదపడం లేదు. మొత్తంగా ఈ సమస్యను పరిష్కరించకుండా తప్పించుకుంటున్నారు' అని ముప్పాళ్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. ఎన్నికలప్పుడు ప్రతి పార్లమెంట్‌కు ఒకరిని ఏర్పాటు చేసి వేసిన బాసట కమిటీ ఏమైందని ప్రశ్నించారు. 2021 జులై 29న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఛైర్మన్‌గా ఐదుగురు ఉన్నతాధికారులతో కాంపిటేటివ్ అథార్టీ కమిటీ వేశారని, అది ఇంతవరకు సమావేశమవ్వలేదని ముప్పాళ్ల గుర్తుచేశారు.

సీఎం జగన్ తాత్సారం: బీవీ చంద్రశేఖరరావు

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై జగన్ తాత్సారం చేయడాన్ని అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖరరావు తప్పుపట్టారు. కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం సరైంది కాదన్నారు. అధికారంలోకి వచ్చాక మంత్రి బొత్స సత్యనారాయణ అగ్రిగోల్డ్ బాధితులంతా తమకు ఓట్లు వేసినట్లు చెప్పడం గుర్తుంది. ఇప్పుడు అదే బాధితులు రోడ్లపై పడ్డారు. తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు? అని చంద్రశేఖరరావు ప్రశ్నించారు. ప్రభుత్వ తాత్సా రమే తమ ఉద్యమాలకు దారితీస్తోందని చెప్పారు. నాడు ప్రభుత్వం వేసిన హైపవర్ కమిటీతో ఒక్క సమావేశమైనా నిర్వహించారా అని ప్రశ్నించారు. హాయ్‌ల్యాండ్ ఆస్తులను ఇంతవరకు వేలం వేయలేదని చెప్పారు. సంక్షేమ పథకాలు ఉన్నవారే ఓటర్లా?, అగ్రిగోల్డ్ బాధితులు కాదా? అని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం ఇప్పటికైనా స్పందించి బాధితులను ఆదుకోవాలని, లేకుంటే జూన్ నుంచి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఎవరీ ఎస్‌హెచ్‌జీ మహిళ ?

పొదుపు శక్తిని యావత్ ప్రపంచానికి చాటి చెప్పిన
స్త్రీ శక్తి ఈ ఎస్‌హెచ్‌జీ మహిళ,
తోటి మహిళల జీవితాల్లో వెలుగులు నింపే
కాంతి ఈ ఎస్‌హెచ్‌జీ మహిళ,
పేదరికం నీడ తన కుటుంబంపై పడనివ్వని
గొడుగు ఈ ఎస్‌హెచ్‌జీ మహిళ,
సెర్ప్ సహకారం, బ్యాంకు రుణం పొంది ఆదాయ వనరులు
సృష్టించే యంత్రం ఈ ఎస్‌హెచ్‌జీ మహిళ,
సంఘనీతితో సామాజిక రీతిని సరిచేయగల
సంఘటిత వనిత ఈ ఎస్‌హెచ్‌జీ మహిళ,
ఆరోగ్య భద్రతను, స్త్రీ హక్కులను ఎలుగెత్తి చాటి చెప్పే
గాయని ఈ ఎస్‌హెచ్‌జీ మహిళ,
ప్రేమానురాగాలు, కుటుంబ విలువలు తెలిసిన
ప్రేమమూర్తి ఈ ఎస్‌హెచ్‌జీ మహిళ,
సెర్ప్ సంస్థతో చేయిచేయి కలిపి పేదరిక నిర్మూలన కోసం
కంకణం కట్టుకున్న ఝాన్సీలక్ష్మీ ఈ ఎస్‌హెచ్‌జీ మహిళ

ఇంతియాజ్, ఐఏఎస్

నూరు శాతం సీట్లు వైసీపీవే : మంత్రి బొత్స

విశాలాంధ్ర-పార్వతీపురం : వచ్చే ఎన్నికల్లో నూటికి నూరుశాతం సీట్లు వైసీపీవేనని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ రాజధాని ఢిల్లీకి దీటుగా రాష్ట్రంలో విద్యను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రపంచ దేశాల్లో మన రాష్ట్ర విద్యార్థుల ప్రతిభ ముందుండాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. దేశంలోనే మొదటి సారిగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. విశాఖలో జరిగిన పెట్టుబడిదారుల సదస్సు విజయవంతమైందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎమ్మెల్యే జోగారావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, దాసరి కార్పొరేషన్ చైర్మన్ ఆర్.రమాదేవి, ఉత్తరాంధ్ర యువజన విభాగం నాయకుడు అవనాపు విజయ్, పార్వతీపురం పరిశీలకులు శోభా హైమావతి, పార్వతీపురం, కురుపాం నియోజక వర్గాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, పీహోకేలు, పట్టభద్రులు పాల్గొన్నారు.

అలిగి వెళ్లిపోయిన కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున పార్వతీపురంలో జరిగిన వైసీపీ కార్యక్రమంలో పాల్గొన్న కురుపాం ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి సమావేశంలో పాల్గొనకుండా అర్ధాంతరంగా వెళ్లిపోవడం సర్వత్రా చర్చనీయాంశం అయింది. రెండు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. సభావేదిక వద్దకు చేరుకొన్న పుష్పశ్రీవాణి, ఆమె అనుచరులు మంత్రి బొత్స సత్యనారాయణ వచ్చే వరకు ఉండి ఆయనకు స్వాగతం పలికారు. అంతవరకు వేదిక మీద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని నిశితంగా పరిశీలించిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి అందులో తన ఫొటో లేకపోవడంతో వేదిక మీదకు వెళ్లకుండా వెనుదిరిగి వెళ్లిపోయారు. కొంత సమయం తరువాత కురుపాం ప్రజాప్రతినిధులు వేదిక మీదకు రాకపోవడాన్ని గమనించిన పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు వారిని రమ్మని పిలిచి వేదికపై కూర్చోబెట్టారు. పార్వతీపురం నియోజకవర్గానికే సమావేశం పరిమితమైనందున ప్రోటోకాల్ ప్రకారం ఫొటోలు పెట్టామని జోగారావు అనుచరులు చెబుతుండగా, రెండు నియోజక వర్గాల సమావేశమని చెప్పడంతో అంతా కలిసి పెద్ద ఎత్తున తరలివచ్చామని కురుపాం ఎమ్మెల్యే అనుచరులు, నాయకులు చెబుతున్నారు.

మహిళలపై దాడులకు వ్యతిరేకంగా పోరాడదాం

జాతీయ మహిళా సమాఖ్య కేంద్ర నాయకురాలు అక్కినేని వనజ

విశాలాంధ్ర-కుక్కునూరు: దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మహిళలపై లైంగిక దాడులు, హత్యలకు కారకులైన దోషులను రక్షించేందుకు పాలక వర్గాలు పూనుకుంటున్నాయని భారత జాతీయ మహిళా సమాఖ్య కేంద్ర నాయకురాలు అక్కినేని వనజ విమర్శించారు. మహిళల హక్కుల కోసం, వారిపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడదామని పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య కుక్కునూరు మండల కమిటీ అధ్వర్యంలో స్థానిక శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో ఏపీ మహిళా సమాఖ్య కుక్కునూరు మండల కమిటీ అధ్యక్షురాలు వర్మా శ్యామల అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. వనజ మాట్లాడుతూ గత 27 సంవత్సరాలుగా మహిళా బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టలేదని అన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రంగాల్లో ఉన్న మహిళలపై లైంగిక దాడులు, హత్యలు విచ్చలవిడిగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను విద్యా, ఉద్యోగ, శాస్త్ర, సాంకేతిక రంగాలకు దూరం చేసి వంటింటికే పరిమితం చేసేందుకు మనువాద సిద్ధాంతాన్ని నెత్తికెత్తుకున్న హిందుత్వ ఫాసిస్టు శక్తులు కేంద్ర ప్రభుత్వం అండతో పేట్రేగిపోతున్నాయని ధ్వజమెత్తారు. 113 ఏళ్ల క్రితం అమెరికా, జపాన్, జర్మనీ వంటి సంపన్న దేశాల్లో పారిశ్రామిక వేత్తలు ఆయా పరిశ్రమలలో మహిళలతో సుమారు 14 నుంచి 18 గంటలు పని చేయించేవారని, అందుకు వ్యతిరేకంగా మహిళలు రోజుకు 10 గంటల కోసం పోరాటం చేసి విజయం సాధించారని, ఆ రోజు నుంచి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించుకుంటున్నట్లు ఆమె వివరించారు. గుజరాత్‌లో బిల్కిస్ బానోపై లైంగిక దాడికి పాల్పడి, ఆమె 13 మంది కుటుంబ సభ్యులను హత్య చేసిన దోషులను పాలకులు జైలు నుంచి బయటకు రప్పించారని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు, పేదలు తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములను అటవీ శాఖ అధికారులు బలవంతంగా గుంజుకుంటూ, మహిళలే లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర పాలకుల మహిళల పట్ల బాధ్యతారహిత వైఖరికి వ్యతిరేకంగా మహిళలు సంఘటితంగా పోరాడాలన్నారు. స్త్రీ పురుష సమానత్వం కోసం మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలుకు ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడి 113 ఏళ్లు గడిచినా మహిళలపై అణచివేత, దోపిడీ, పీడన పోలేదని, మహిళా సాధికారత ఆమడ దూరంలో ఉందని విమర్శిం చారు. స్వాతంత్ర్యం సిద్ధించి 73 ఏళ్లు అయినప్పటికీ అనేక గ్రామాల్లో మహిళలు మంచినీటి కోసం రోడ్డు ఎక్కాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. నేటికీ అనేక గ్రామాల్లో విద్యా వైద్యం అందనంత దూరంలో ఉన్నాయని ఆయన పాలకుల తీరును ఎండగట్టారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8న అందించిన స్ఫూర్తితో మహిళలు ఉద్యమ బాట పట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు కొండేటి బేబి, మహిళా సమాఖ్య మండల నాయకులు వర్మా లక్ష్మి, సోడె వెంకమ్మ, కొన్నె జయశ్రీ, సారంగా సరోజిని, వరసా రోజా, వంజం గంగ, సీపీఐ కుక్కునూరు మండల నాయకులు మైసాక్షి వెంకటాచారి, అయితా సురేష్, కొన్నె లక్ష్మయ్య, కూరాకుల బాబురావు, వరసా పాపారావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై వివక్ష కొనసాగుతోంది

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి
- నాగేంద్ర హత్య కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరపాలి

విశాలాంధ్ర-పాయకరావుపేట (అనకాపల్లి): చట్ట ప్రకారం అందరూ సమానమే అయినప్పటికీ రాష్ట్రంలో దళితులపై కనిపించని వివక్షత కొనసాగుతోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. బుధవారం అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట మండలం పీఎల్‌పురం గ్రామంలో హత్యకు గురైన దళిత యువకుడు వడ్లమూరి నాగేంద్ర కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం గ్రామంలో దళితులతో చర్చలు జరిపారు. జేవీఎస్ఎన్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా దళితులపై దాడులు యథాతథంగా కొనసాగుతున్నాయని అన్నారు. దళితుడి హత్య జరిగినందునే కేసు విచారణ నత్తనడకన సాగుతోందని, అదే అగ్రవర్ణాల వారెవరైనా హత్యకు గురయితే గ్రామంలో యుద్ధ వాతావరణం జరిగి ఉండేదని అన్నారు. పని చేస్తున్న చోటే హత్యకు గురయ్యాడని, కేసులో భూ యజమానుల పేర్లు చేర్చి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసి హంతకులను అరెస్టు చేయడంతో ఉద్యమం ఆగిపోకూడదని, కోర్టులో హంతకులకు కఠిన శిక్షలు పడే వరకు ఐక్యంగా ఉండి పోరాడాలని కోరారు. 90 రోజుల్లో కోర్టుకు ఛార్జిషీట్ అందజేయకపోతే అరెస్టయిన వారు జైలు నుంచి బయటకు వచ్చి కేసులో నుంచి బయటపడే ప్రయత్నాలు చేస్తారని తెలిపారు. హంతకులకు శిక్ష ఖరారయ్యే వరకు వారు జైలు నుంచి బయటకు రాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. నాగేంద్ర హత్య కేసును ఫాస్ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరపాలని, కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, కుటుంబానికి రక్షణ కల్పించాలని, కేసును త్వరితగతిన ఛేదించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే హత్య విషయాన్ని జాతీయ, రాష్ట్ర ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలని నాయకులకు సూచించారు.

హంతకులకు శిక్షలు ఖరారయ్యే వరకు బాధిత కుటుంబానికి, దళితులకు సీపీఐ అండగా ఉంటుందని జేవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి రామునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు రావు వెంకట జగ్గారావు, బందుల సుబ్బలక్ష్మి, డీసీహెచ్ రాజబాబు, గురుబాబు, కె.సన్యాసిరావు, పాయకరావుపేట మండల కార్యదర్శి వెలుగుల అర్జున్‌రావు, నక్కపల్లి మండల కార్యదర్శి అజయ్‌పార్థ, రౌతు రామచంద్ర, సీహెచ్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో

ఉద్యమ నేతలకు పట్టం కట్టండి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: ఈ నెల 13న జరగనున్న పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఉద్యమ నాయకులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆత్మగౌరవాన్ని గెలిపించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న పిలుపునిచ్చారు. బుధవారం ఎస్టీయూ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తిమ్మన్న మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలోని 2 లక్షల మంది ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని తగ్గించే కుట్ర చేస్తోందని విమర్శించారు. ముఖ్యంగా 11వ పీఆర్‌సీకి సంబంధించి గత ఏడాది ఫిబ్రవరిలో విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డు ఉద్యమం మొదలుకొని ఈరోజు వరకు ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. వారికి రావలసిన పీఆర్సీ బకాయిలు, కరువు భత్యం బకాయిలు, భవిష్య నిధి, జీవిత బీమా బకాయిలు చెల్లించకుండా ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. ప్రతి నెల జీతాలు కూడా ఒకటో తేదీన చెల్లించకుండా 15వ తేదీ వరకు వేచి ఉండేలా చేస్తోందని, ఫలితంగా ఉపాధ్యాయులు వారి గృహ, వ్యక్తిగత రుణాల నెల వాయిదా చెల్లింపులకు బ్యాంకులకు పెనాల్టీ కట్టాల్సి వస్తోందని, ఈ మొత్తానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక గౌరవం ఉందని, కానీ ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులను ప్రభుత్వ, ప్రజా వ్యతిరేకులుగా చిత్రీకరించేలా అనేక చర్యలు చేపట్టిందని విమర్శించారు. తక్షణమే ఉపాధ్యాయులకు రావలసిన అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. పాఠశాలకు విద్యార్థులు శుభ్రంగా రాకపోయినా ఉపాధ్యాయులు ఎలా బాధ్యత వహిస్తారని, దీనిని సాకుగా చూపి ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 3,4,5, తరగతుల విలీనం వల్ల ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమవుతాయని, తక్షణం తరగతుల విలీనాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అశాస్త్రీయంగా అమలు చేస్తున్న ఈ విధానం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 4 వేల ప్రాథమిక పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందని, భవిష్యత్తులో ఉపాధ్యాయ నియామకాలకు డీఎస్సీ వేసే అవసరం కూడా ఉండదని తెలిపారు. సీపీఎస్ రద్దు చేస్తామన్న ప్రభుత్వం ఇంతవరకు ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కనీసం బదిలీలు కూడా నిర్వహించలేక 2 వేల మంది ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్లడానికి కారణమైందని విమర్శించారు. ప్రైవేటు పాఠశాలలకు కూడా పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయలేని దుస్థితి నెలకొందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రైవేటు పాఠశాలల గుర్తింపు, రెన్యువల్‌ను మూడు సంవత్సరాల కుదించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి విద్యావ్యవస్థ మెరుగుదలకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు ముదసర్ అహ్మద్, నాగరాజు, చిన్న పాలయ్య, జిల్లా నాయకులు దేవదాసు, వెంకట్రాముడు, సుధీంద్ర, గోవింద నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై పరస్పర సహకారం

పయ్యావుల, కాలవతో సీపీఐ చర్చలు

విశాలాంధ్ర-ఉరవకొండ/కణేకల్లు: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై సీపీఐ ప్రతినిధి బృందం బుధవారం అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్ల గ్రామంలో ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను, కణేకల్లు మండలం ఉడేగోళంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులను వేర్వేరుగా కలిసి...చర్చించారు. ఎమ్మెల్సీ ఎన్నికలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు, పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజుకు రెండవ ప్రాధాన్యత ఓటు వేసేలా నిర్ణయం తీసుకోవాలని పయ్యావుల, కాలవను కోరారు. దీనికి ప్రతిగా తెలుగుదేశం పార్టీ బలపరుస్తున్న పట్టభద్రుల అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డికి సీపీఐ, ప్రజా సంఘాలు రెండవ ప్రాధాన్యత ఓటు వేయించడానికి విస్తృత ప్రచారం నిర్వహిస్తామని కేశవ్‌కి తెలిపారు. దీనిపై తెలుగుదేశం పార్టీ సానుకూలంగా స్పందించాలని ప్రతిపాదన చేశారు. సీపీఐ ప్రతినిధి బృందంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్, జిల్లా కార్యదర్శి సి.జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శులు పి.నారాయణస్వామి, సి.మల్లికార్జున, జిల్లా నాయకులు కేశవరెడ్డి, మల్లికార్జున, మనోహర్, సంగప, వెంకటేశ్, తలారి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

కార్మిక సంఘాల ఐక్య వేదిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పీడీఎఫ్ అభ్యర్థులతో పాటు పీడీఎఫ్ బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక విజ్ఞప్తి చేసింది. విజయవాడ బాలోత్సవంలో బుధవారం కార్మిక సంఘాల ఐక్య వేదిక నేతలు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రవీంద్రనాథ్, జి.ఓబులేసు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి జి.ఎన్.శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎ.వి.నాగేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ ఎ.రంగ నాయకులు, ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.కోటేశ్వరరావు, ఇన్సూరెన్స్ పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు ఎం.ఎస్.పాత్రుడు, బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.అజయ్‌కుమార్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ తదితరులు హాజరయ్యారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ పీడీఎఫ్, పీడీఎఫ్ బలపరిచిన పట్టభద్రుల నియోజకవర్గాల అభ్యర్థులుగా ఉత్తరాంధ్ర నుంచి కె.రమాప్రభ, తూర్పు రాయలసీమ నుంచి మీగడ వెంకటేశ్వర రెడ్డి, పశ్చిమ రాయలసీమ నుంచి పి.నాగరాజు, ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థులు పశ్చిమ రాయలసీమ నుంచి కత్తి నరసింహారెడ్డి, తూర్పు రాయలసీమ నుంచి పి.బాబూరెడ్డి పోటీ చేస్తున్నారని వివరించారు. వారిని 250కు పైగా ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు బలపరుస్తున్నాయని తెలిపారు. ఈ ఐదుగురు అభ్యర్థులకు ఒకటో ప్రాధాన్యతా ఓట్లేసి గెలిపించాలని అభ్యర్థించారు. వైసీపీ అభ్యర్థులను ఓడించి వారి పాలన పట్ల కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయులు వ్యతిరేకంగా ఉన్నారనే దిశగా ఈ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులకు నష్ట దాయకమైన లేబర్ కోడ్‌లు ఆమోదించిందని, ప్రజావ్యతిరేక ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం బలపరుస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్ రద్దు చేయలేదన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు సకాలంలో ఇవ్వడం లేదని, రకరకాల యాప్‌లు తెచ్చి పని భారం పెంచిందని, భవన నిర్మాణం, హమాలీ, రవాణా కార్మికుల సంక్షేమ పథకాలకు తిలోదకాలు ఇచ్చిందని వివరించారు. ఇలాంటి సమయంలో మన సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించడానికి, మన పోరాటాలకు అండగా నిలవడానికి పీడీఎఫ్, మద్దతుగల ఎమ్మెల్సీల అవసరం ఉందన్నారు. పీడీఎఫ్ అభ్యర్థులు 2007 నుంచి ప్రజా సేవకు అంకితమై పని చేస్తున్నారని, నీతిమంతమైన రాజకీయాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నరసింగరావు తదితరులు మాట్లాడుతూ చట్టసభ లోపల, వెలుపలా ప్రజా ఉద్యమాలకు పీడీఎఫ్, మద్దతుతో గెలిచిన అభ్యర్థులు ప్రధాన భూమిక పోషిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్లు, టైంస్కేల్, డైలీవేజ్ ఉద్యోగులు తదితరుల కోర్కెల పరిష్కారం కోసం ప్రభుత్వంతో రాయబారాలు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి: కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర-నంద్యాల: శాసనమండలిలో ప్రజల సమస్యలపై పాలకులను నిలదీసే వారికి ఓటువేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పీడీఎఫ్ అభ్యర్థి కత్తినరసింహారెడ్డి కోరారు. నంద్యాలలోని ప్రైవేట్ పాఠశాల, కళాశాలలో ఆయన బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయులకు, నిరుద్యోగులకు చేసిందేమీలేదన్నారు. కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నదని విమర్శించారు. సీపీఎస్ రద్దు హామీని జగన్ సర్కారు ఉద్దేశపూర్వకంగానే విస్మరించిందని మండిపడ్డారు. ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఉద్యోగుల సమస్యలు గుర్తుకువచ్చాయని విమర్శించారు. సమస్యలపై అవగాహన ఉండి ఉపాధ్యాయుల, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పని చేసే వ్యక్తులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రశ్నించే ఉద్యమ నాయకులను శాసనమండలికి పంపించాలని పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కత్తి నరసింహారెడ్డితో పాటు ఎస్‌టీయూ సీనియర్ నాయకులు షణ్మూర్తి, లెక్చరర్ల సంఘం నాయకులు రమేశ్, ఎస్‌టీయూ నాయకులు చంద్రశేఖర్, ఆజాం బేగ్, మౌలాలి, ప్రజాసంఘాల నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపు బాధ్యత యువతదే

లెనిన్ బాబు పిలుపు

విశాలాంధ్ర-కర్నూలు: రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, కార్మిక సమస్యలు పరిష్కారం కావాలంటే పీడీఎఫ్ అభ్యర్థులు గెలవాలని, ఆ బాధ్యత యువత తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. తెలంగాణలోని అల్లంపూర్‌లో బుధవారం మాంటిసోరి హైస్కూల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోసం ప్రచారం నిర్వహించారు. లెనిన్‌బాబు మాట్లాడుతూ ఏపీలో జగన్ ప్రభుత్వం జాబ్ కేలండర్ పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తోందన్నారు. టీచర్లకు జీతాలిచ్చే పరిస్థితి లేదన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడుస్తున్న డీఎస్సీ విడుదల చేయలేదన్నారు. పీడీఎఫ్ అభ్యర్థులు నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నించి, వారి సమస్యలను

పరిష్కరించేందుకు కృషి చేస్తారని లెనిన్‌బాబు నొక్కిచెప్పారు. శాసనమండల్లో పోరాడే నాయకులు ప్రస్తుతం అత్యవసరమని అన్నారు. అందుకే పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు, కర్నూలు పట్టణ కార్యదర్శి చంద్రశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

సంపాదకీయం

పగటికలగా ప్రతిపక్ష కూటమి!

దాదాపుగా మరో ఏడాదిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో దేశ ప్రజలలో కలహాలు రేపుతున్న బీజేపీని ఓడించాలన్న ఆకాంక్ష అన్ని ప్రతిపక్ష పార్టీలలో బలంగానే కనిపిస్తోంది. అయితే ప్రతిపక్షాల ఐక్యతాయత్నాలు అంతే బలహీనంగా ఉన్నాయి. పదునైన ఎన్నికల యంత్రాంగంగా మారిపోయిన మోదీ నాయకత్వంలోని బీజేపీని ఓడించాలంటే ప్రతిపక్షాలన్నీ ఏకం కాక తప్పదు అన్న అభిప్రాయం సర్వత్రా ఉంది. కానీ ఆచరణలోకి వచ్చేసరికి తమ రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు మాత్రం కాంగ్రెస్‌తో ఎలాంటి సంబంధానికైనా ససేమిరా అంటున్నాయి. ఈ ప్రాంతీయ పార్టీలలో మొట్టమొదట ప్రతిపక్షాల ఐక్యత గురించి మాట్లాడింది మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెసే. కానీ ఆ పార్టీ కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడానికి విముఖంగా ఉంది. మరో వేపున తెలంగాణలో అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితికి నాయకత్వం వహిస్తున్న కె.చంద్రశేఖరరావు ఒంటరిగా ప్రాంతీయ పార్టీలను ఐక్యం చేయడానికి ఒకటి రెండు విడతలు ప్రయత్నం చేశారు. ఆయన సమస్య కూడా కాంగ్రెస్‌ను ప్రతిపక్ష కూటమిలో భాగస్వామిని చేయడమే. తెలంగాణలో బీజేపీ కన్నా కాంగ్రెస్‌నే కె.సి.ఆర్. ప్రధాన ప్రత్యర్థిగా భావిస్తున్నారు. పైగా జాతీయ రాజకీయాలలో కీలకపాత్ర పోషించాలన్న భావనతో తెలంగాణ రాష్ట్రసమితి పేరు భారత రాష్ట్రసమితిగా మార్చేశారు. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ నాయకుడు శరద్ పవార్ లాంటి వారు దేశమంతటా అస్తిత్వంఉన్న కాంగ్రెస్‌ను మినహాయించే ప్రతిపక్ష కూటమివల్ల ప్రయోజనం ఉండదని భావిస్తున్నారు. ప్రాంతీయ పార్టీలను మినహాయిస్తే అనేక బీజేపీ వ్యతిరేక పక్షాలకు కాంగ్రెస్‌లేని ప్రతిపక్ష కూటమివల్ల ఫలితం ఉండదన్న అభిప్రాయం బలంగానే ఉంది. కానీ కాంగ్రెస్‌కు భాగస్వామ్యం ఉండే ప్రతిపక్ష కూటమికి అవకాశాలు సన్నగిల్లుతున్నాయని ఈ నేతలలో కొందరు భావిస్తున్నారు. అందుకే ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు మనీశ్ సిసోడియాను అరెస్టు చేసిన తరవాత ఎనిమిది పార్టీలకు చెందిన తొమ్మిది మంది నేతలు కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులమీద దాడికి మోదీ సర్కారు వినియోగించడం ప్రజాస్వామ్యానికి విఘాతంగా భావించి గతవారంలో ఈ విషయమై ప్రధానమంత్రి మోదీకి ఉమ్మడిగా ఒక లేఖ రాశారు. ఎన్ని సమస్యలమీద ప్రతిపక్షాలు స్పందించినా, ఎంత మంది ప్రతిపక్ష నాయకుల మీద ఆదాయపు పన్నుశాఖ, సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ లాంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించినా దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్‌ఆద్మీ పార్టీ పెదవైనా విప్పలేదు. అయితే లేఖ రాసిన వారిలో దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ ఉండడం విచిత్రమే. ఎనిమిది పార్టీలకు చెందిన తొమ్మిదిమంది నాయకులు కలిసి ప్రధానమంత్రికి లేఖ రాయడంతో మూడో ప్రత్యామ్నాయం కోసం కృషి మొదలైందన్న భావం మొలకెత్తింది. అంటే ప్రతిపక్ష ఫ్రంటో, మూడో ఫ్రంటో ఏర్పడితే అందులో ఆమ్ ఆద్మీ పార్టీని భాగస్వామిని చేయడానికి ఈ లేఖ మీద సంతకాలు చేసిన నాయకులకు అభ్యంతరం లేదనుకోవాలి. ఈలేఖ రాసినవారిలో నేషనలిస్ట్ కాంగ్రెస్‌పార్టీ అధినేత శరద్ పవార్, నేషనల్ కాన్ఫరెన్స్ అధినాయకుడు ఫరూఖ్ అబ్దుల్లా, శివసేనలో ఒక వర్గం నాయకుడు ఉద్ధవ్ ఠాక్రే, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, బిహార్ ఉపముఖ్యమంత్రి, రాష్ట్రీయ జనతాదళ్ అగ్రనేత తేజస్వీ యాదవ్ ఉన్నారు. ఈ తొమ్మిది మందిలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు, అఖిలేష్ యాదవ్ తప్ప మిగతా వారంతా కాంగ్రెస్‌తో కలిసి ప్రతిపక్షాలను ఐక్యం చేయడానికి సానుకూలంగా ఉన్నవారే. ప్రధానికి లేఖ రాసిన వారిలో కాంగ్రెస్ నాయకులు ఎవరూలేరు. అలాగే భారత రాష్ట్ర సమితి అధినేత కె.చంద్రశేఖరరావు, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, కర్నాటకలో జె.డి.(ఎస్) నాయకుడు హెచ్.డి.కుమారస్వామి కూడా సంతకం చేయలేదు. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడానికి అభ్యంతరంలేని శరద్‌పవార్, ఫరూఖ్‌అబ్దుల్లా మాత్రం సంతకాలుచేసిన వారిలో ఉన్నారు. అంటే ఈ ఇద్దరు నాయకులు కాంగ్రెస్‌కు ఎలాంటి పాత్రాలేని ప్రతిపక్ష కూటమిలో భాగస్వాములు కావడానికి సంసిద్ధంగా ఉన్నారనుకోవాలా? ఈ విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదు.

మూడో ఫ్రంట్ కచ్చితంగా బీజేపీకే మేలుచేస్తుందని భారత్ జోడో యాత్ర సఫలమైన ఊపులో రాహుల్ గాంధీ ప్రకటించారు. అయితే ఈ యాత్రతో కాంగ్రెస్ ఎంతోకొంత పుంజుకుందనుకుంటున్న తరుణంలోనూ కాంగ్రెస్ ప్రతిపక్ష ఐక్యతకు చేసిన ప్రయత్నమూ పూజ్యమే. మోదీసర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించి అన్ని పార్టీల వారినీ వేధిస్తూనే ఉంది. ఈ పార్టీలు కలిసి ఉమ్మడిగా మోదీ నాయకత్వంలోని బీజేపీని ఎదిరించడం దాడులనుంచి తప్పించుకున్న పార్టీ ఒక్క నితీశ్ కుమార్ నాయకత్వంలోని జె.డి(యు) మాత్రమే అనుకోవాలి. అయినా ఆయన కాంగ్రెస్ సహా అన్ని ప్రతిపక్షాలు కలిసి పోరాడడం ఒక్కటే మార్గం అంటున్నారు. బిహార్‌లో ఆయన బీజేపీతో తెగతెంపులు చేసుకుని తేజస్వీ యాదవ్ నాయకత్వంలోని రాష్ట్రీయ జనతాదళ్‌తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుంచి ప్రతిపక్ష ఐక్యత గురించి నితీశ్ నిరంతరం మాట్లాడుతూనే ఉన్నారు. పైగా ప్రతిపక్ష కూటమిలో కాంగ్రెస్ ఉండి తీరవలసిందేనంటున్నారు. ఈ కూటమికి నితీశ్ కుమార్ తగిన నాయకుడన్న ప్రచారాన్ని కూడా ఆయన తోసిపుచ్చారు. నాయకుడు లేదా ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరన్న విషయం ఎన్నికల తరవాత తేల్చుకోవచ్చునన్నది ఆయన గట్టి నమ్మకం. కానీ భారత్ జోడో యాత్ర సఫలమైందన్న అభిప్రాయం కల్గిన తరవాత పైకి చెప్పకపోయినా రాహుల్ గాంధీయే ప్రధానమంత్రి అభ్యర్థి అన్నమాట కాంగ్రెస్ నాయకుల నోట వినిపిస్తూనే ఉంది. కాంగ్రెస్ కేవలం 200 సీట్లకే పోటీ చేయమంటే ఎలా అంగీకరించగలం అని భారత్ జోడో యాత్ర మధ్యలోనే రాహుల్ వెన్నంటి నడిచిన జై రాం రమేశ్ దాపరికం లేకుండానే మనసులోమాట చెప్పేశారు. ఈ వ్యవహారం అంతా చూస్తే మోదీని ఓడించాలన్న ఏకైక లక్ష్యంతో ప్రతిపక్ష కూటమి ఏర్పడుతుందన్న నమ్మకం కుదరడంలేదు. అంటే ప్రతిపక్ష కూటమి పగటికలగానే మిగిలిపోతుందేమో! 2019లోనూ ప్రతిపక్ష ఐక్యతాయత్నాలు ఫలించనందువల్ల బీజేపీకే మేలు కలిగింది. ఇప్పుడూ ప్రతిపక్షాలు సమైక్యం కాకపోతే లాభపడేది మళ్లీ మోదీనే.

ఆయుధాలను నమ్ముకుని అభివృద్ధిని మరచిన పాకిస్థాన్

అత్యంత దారుణమైన ఆర్థిక పరిస్థితుల మధ్య పాకిస్తాన్ కొట్టుమిట్టాడుతున్నది. సమీప భవిష్యత్తులో ఎవరూ పూడ్చలేనంత స్థాయిలో పాకిస్థాన్ ఆర్థికంగా పతనమై పోయింది. పాకిస్తాన్ తన దేశ ప్రజలను గాలికి వదిలేసి, వారికి జీవించడానికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా అణ్వాయుధాలను ఇబ్బడి ముబ్బడిగా పెంచుకుంటూ, ఉగ్రవాదులను పెంచి పోషించింది. సరిహద్దుల్లో ఉగ్రవాదులను చొప్పించడమే కాకుండా స్వయంగా పాక్ సైన్యమే కాల్పులకు ఒడిగట్టిన సందర్భాలు కోకొల్లలు. కొంతమందిని కొన్నిసార్లు మోసం చేయవచ్చు, అందరినీ అన్నిసార్లు మోసం చేయలేమన్న నానుడి పాక్ విషయంలో నిరూపితమైనది. అగ్రరాజ్యాలను, ఐక్యరాజ్య సమితిని, ఇతర అంతర్జాతీయ సంస్థలను, మానవ హక్కుల సంఘాలను మభ్యపెట్టి భారత్‌పై దుష్ప్రచారాన్ని కొనసాగించిన పాకిస్థాన్ ప్రస్తుతం భారత్‌కు పాదాక్రాంతమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. అహంకారంతో విర్రవీగే దేశాలు పాకిస్థాన్ దైన్యస్థితిని గుణపాఠంగా నేర్చుకోవాలి. సైనిక నియంతల కనుసన్నల్లో పనిచేస్తూ పాక్ పాలకులంతా అధికారంకోసం మాత్రమే పనిచేసారు. చివరికి అధోగతి పాలైనారు. సైనిక నియంతల పాలనలో చాలాకాలం పాకిస్థాన్ అరాచకాన్ని చవిచూసింది.

ప్రజాస్వామ్యం పేరుతో ప్రభుత్వాలు ఏర్పడినా అవి కేవలం సైనిక ఆజ్ఞలకు లోబడే పనిచేసాయి. 1965,1971లో ఇరు దేశాల మధ్య జరిగిన యుద్ధాలు ముఖ్యంగా 1965లో 17రోజులపాటు జరిగిన యుద్ధంలో పాక్ బెంబేలెత్తి అమెరికా-రష్యాలను శరణు వేడుకున్న ఫలితంగా ఆయూబ్ ఖాన్-లాల్ బహదూర్ శాస్త్రిల మధ్య కుదిరిన తాష్కెంట్ ఒప్పందం వలన తాత్కాలికంగా రెండుదేశాల మధ్య యుద్ధ వాతావరణం సద్దుమణిగినా చివరకు ఆ ఒప్పందాన్ని కూడా పాక్ ఉల్లంఘించింది. తెల్లదొరల ఏలుబడిలో ఆర్థికంగా చిన్నాభిన్నమైన పరిస్థితుల్లో భారత్ కూడా స్వాతంత్ర్యానంతరం అనేక కష్ట నష్టాలను చవిచూసింది. ఇక చిన్న మత ప్రాతిపదిక దేశమైన పాక్ విషయం గురించి, ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. సహజ వనరులు గల భారతదేశమే అనేక ఆర్థిక సంక్షోభాలను చవిచూసింది. కూటికోసం, గూడు కోసం ఎన్నో ఏళ్లు అలమటించింది. విద్య, ఉపాధి అవకాశాల కోసం ఎంతో తపించింది. స్వాతంత్ర్యంవచ్చినా పొరుగు దేశాల నమ్మకద్రోహం వలన భారత్ అనేక విధాలా నష్టపోయింది. బ్రిటీషర్ల నుండి విముక్తి పొందిన భారత్ ఆర్థికంగా కుదుటబడక ముందే, భారత్‌ను అనేక సవాళ్లు చుట్టుముట్టాయి. భారత్ అభివృద్ధిపై కాకుండా దేశభద్రతపై దృష్టి సారించ వలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

బంగ్లాదేశ్ విమోచనోద్యమం సమయంలో భారత్ కీలక పాత్ర పోషించడం బంగ్లాదేశ్ విభజన జరగడం వలన అప్పటి నుంచి పాక్ మరింత రెచ్చి పోయింది. ఉగ్రవాదులను పెంచి పోషించింది. ఉగ్రవాదులే శాసించే పరిస్థితుల్లోకి పాకిస్థాన్ నెట్టబడింది. ఇది భారత్‌కుపెద్ద తలనొప్పిగా పరిణమించింది. జనరల్ జియా ఉల్‌హక్, ముషారఫ్ లాంటి కరుడు గట్టిన పాక్ నియంతలు భారత్‌పై విద్వేషాన్ని వెళ్ళగక్కి పాక్ ప్రజలను తప్పుదారి పట్టించారు. తర్వాత వచ్చిన పాలకులు కూడా అదే బాటలో పయనించి, పాకిస్తాన్‌ను అధోగతి పాలు చేసారు. కోవిడ్ వలన సంభవించిన ఆర్థిక కష్టాలనుండి కోలుకోకముందే పాక్ తీవ్రమైన వరదల వలన కకావికలమైనది. రష్యా- ఉక్రెయిన్ల మధ్య యుద్ధం వలన తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో పడింది.

ఒక్కపూట ఆహారం కోసం ప్రజలు హాహాకారాలు చేస్తున్నారు. ఇంధన ధరలు ఆకాశాన్నంటాయి. పాక్‌లో అంతర్గత యుద్ధం చెలరేగింది. బెలూచిస్థాన్ వంటి ప్రాంతాలు భారత్‌లో తమ భూభాగాన్ని విలీనం చేయాలని కోరుకుంటున్నాయి. ఆర్థికంగా ఛిన్నాభిన్నమైన పాక్ అప్పులకోసం అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ పెట్టిన కఠినమైన షరతులను అంగీకరించక తప్పలేదు. ఎవరు ఎంత సహాయం చేసినా అది కేవలం తాత్కాలిక ఉపశమనమే తప్ప పాక్ కోలుకునే పరిస్థితిలో లేదు. అభివృద్ధిని విస్మరించి, ప్రజలను గాలికి వదిలేసి, ఆయుధాలను నమ్ముకున్న పాకిస్తాన్ చివరకు ఆర్థికంగా పతనమై అన్నమో రామచంద్రా! అంటూ విలపించే దుస్థితికి వచ్చింది. అభివృద్ధిని విస్మరించి, అరాచక వాదంతో ఇతర దేశాల సమగ్రతను, సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని ప్రయత్నించే దుష్టశక్తులకు పాక్ ప్రస్తుత దైన్యస్థితి ఒక గుణపాఠం కావాలి.

సుంకవల్లి సత్తిరాజు, సెల్: 9704903463

ఈసీపై సుప్రీం తీర్పు చరిత్రాత్మకం

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను, కమిషనర్లను ఎంపిక చేయడానికి కమిటీని నియమిస్తూ గత గురువారం సుప్రీంకోర్టు ధర్మాసనం ఉత్తర్వు జారీ చేసింది. ఈ కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు (లేదా అతి పెద్ద ప్రతిపక్షం నాయకుడు), భారత ప్రధాన న్యాయమూర్తి ఉంటారు. ఇక ముందు ఈ కమిటీ ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను, ఇతర కమిషనర్లను ఎంపిక చేస్తుంది. అనంతరం వీరిని భారత రాష్ట్రపతి నియమిస్తారు. ఈ ఉత్తర్వు చరిత్రాత్మకమైంది. ఇందులో నర్మగర్భమైన ప్రభావంఉంది. ఇంతవరకు పాలకులే వీరిని ఎంపిక చేస్తున్నారు. సాధారణంగా తమకు అనుకూలంగా ఉన్నవారినే ఎంపికచేసి ప్రయోజనం పొందుతున్నారనే అభిప్రాయం ప్రబలంగా ఉంది. ఇకపై అలాంటి అవకాశం ప్రభుత్వానికి ఉండకుండా ఈ ఉత్తర్వు అడ్డుకట్టవేస్తుంది. 2014లో జరిగిన ఎన్నికలనాటి నుండి ఎన్నికల కమిషన్ బీజేపీ ప్రభుత్వానికి లొంగిఉంటూ, ఎన్నికల కోడ్‌ను అమలు చేయడంలోనూ సొంత నిర్ణయాలు తీసుకోవడం లేదన్న ఆరోపణలను సుప్రీంకోర్టు పరిగణలోకి తీసుకుంది. ప్రధానమంత్రి, ఆయన సహచరులు ప్రతిపక్షాలపైన, మైనారిటీలు, ఇతర మతాలపైన నిరాధారమైన నిందలువేస్తూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూనే ఉన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా స్వల్ప విషయాలకే ప్రతిపక్ష అభ్యర్థులను తక్షణం అరెస్టుచేసి శిక్షించడం తరచూ జరుగుతోంది. పాలక బీజేపీ అభ్యర్థులు తప్పులుచేసినా తప్పించుకుంటున్నారు. వీరిపై అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ చాలా అరుదుగా చర్యలు తీసుకుంటారు. పాలకపార్టీకి అనుకూలంగా పోలింగ్ తేదీలను జాప్యం చేయడం లేదా సర్దుబాటు చేయడం సార్వసాధారణమైంది. విచ్చలవిడిగా డబ్బు దుర్వినియోగం చేస్తున్నా, పంపిణీచేస్తున్నా ఎన్నికల కమిషన్(ఈసీ) పట్టించుకోకపోవడం చాలా మామూలు అయిపోయింది. పాలకపార్టీ దౌర్జన్యాలను పట్టించుకోవడంలేదు. ప్రతిపక్షాలను మాత్రం వదిలిపెట్టడం లేదు.

కేఎం.జోసెఫ్ నాయకత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయమూర్తులు అజయ్‌రస్తోగి, అనిరుద్ధబోస్, హృషీకేష్‌రాయ్, సి.టి.రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్మానం వెలువరించింది. అయితే జస్టిస్ రస్తోగి ఈ తీర్పుతో ఏకీభవిస్తూనే ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల పదవీకాలం భద్రత అంశాలను

జోడించి తీర్పు చెప్పారు. రాజ్యాంగంలో 324(2) అధికరణ ప్రకారం, పార్లమెంటు చట్టం చేసేంతవరకు తమ ఉత్తర్వు అమలులో ఉంటుందని కూడా న్యాయమూర్తులు పొందుపరిచారు. పార్లమెంట్ ఆమోదించిన చట్టంలోని అంశాలకులోబడి రాష్ట్రపతి సీఈసీని, ఇతర కమిషనర్లను నియమిస్తారు. ఈ తీర్పు చరిత్రాత్మకమైంది. ఇంతవరకు పాలకపార్టీ పరిధిలోఉన్న సీఈసీ, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియనుండి ఆ పార్టీని తప్పించారు. అధికరణ 324(1) ప్రకారం, ఎన్నికల కమిషన్ (ఈసీఐ) స్వతంత్రతను ఈ తీర్పు కాపాడింది. ఈ అధికరణకు ఓటర్ల జాబితాను తయారుచేయడం, నియంత్రించడం, మార్గదర్శనంచేయడం, పార్లమెంటుకు, రాష్ట్రాల అసెంబ్లీలకు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతులకు ఎన్నికలునిర్వహించే అధికారం ఉంటుంది.

తాజాగా సుప్రీంకోర్టు జారీచేసిన ఉత్తర్వు అత్యంత ప్రాధాన్యత కలది. రాజ్యాంగ కర్తవ్యం నెరవేర్చేందుకు అధికరణ 324(2) ప్రకారం, పార్లమెంటు చట్టం చేయకపోవడంవల్ల ఏర్పడిన శూన్యతను ఈ ఉత్తర్వు భర్తీ చేస్తుంది. అధికారంలో ఉన్న ప్రతిపార్టీ తమ రాజకీయాల అభీష్టానికి అనుగుణంగా, భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో తిరిగి గెలుపొందడానికివీలుగా ఈసీ సభ్యులను నియమించే పూర్తి అధికారం కావాలని కోరుకుంటాయి. మన దేశం రిపబ్లిక్‌గా అవతరించి 73ఏళ్లు గడచిన తర్వాత కూడా ఈసీ సభ్యులను సంపూర్ణ ప్రజాస్వామికంగా, పారదర్శకంగా నియమించేందుకువీలుగా చట్టంచేయాలని అధికారంలోఉన్న ఏ పార్టీ ప్రయత్నించలేదు. చట్టంచేసి రాజ్యాంగ కర్తవ్యాన్ని నెరవేర్చేందుకు పూనుకోలేదు. అనేకమంది రాజ్యాంగ అసెంబ్లీసభ్యులు, రాజ్యాంగ రూపకల్పన కమిటీ చైర్మన్ డా.బిఆర్ అంబేద్కర్ ఈ అంశంపై అనాడే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారనేది మనం మరువరాదు. ఎన్నికల కమిషన్ నియామకంపై 1949 జూన్ 16న అధికరణ 289 రాజ్యాంగ ముసాయిదాపై (రాజ్యాంగంలోని అధికరణం 324తో సమానమైనది) అంబేద్కర్ మాట్లాడుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ లేదా ఇతర ఎన్నికల కమిషనర్ పదవికి అర్హతలేని వ్యక్తిని నియమించకూడదు అన్న అంశం లేదని చెప్పారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్ డాక్టర్ అంబేద్కర్ ఇతర రాజ్యాంగ అసెంబ్లీ సభ్యులు వ్యక్తంచేసిన ఆందోళనను గుర్తు చేసుకోవడం ఎంతైనా అవసరం. భారత ఎన్నికల కమిషన్(ఈసీఐ) స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థగా ఉండాలన్నది లక్ష్యం. అయితే ఈ సంస్థ స్వతంత్రత దిగజారిపోతున్నది. ప్రత్యేకించి 2019 లోక్‌సభ ఎన్నికల నాటినుంచి పాలక బీజేపీ ప్రభావంతో ఈ స్వతంత్రత దిగజారుతోంది. 2022లో ప్రధానమంత్రి కార్యాలయం చర్చలకు రావలసిందిగా ఈసీ సభ్యులను పిలిపించింది. అక్కడ ప్రభుత్వం చెప్పిన అంశాలకు అనుగుణంగా ఈసీ సభ్యులు నిర్ణయాలు తీసుకోవాలని ప్రధాని మోదీ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణాక్రమంలో ప్రధాని మోదీ హోం మంత్రి అమిత్ షాలు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి నప్పటికీ వారు ఎటువంటి తప్పు చేయలేదని చెప్పడానికి కమిషన్ సభ్యులలో అశోక్ లవసా మాత్రమే తిరస్కరించారు. ఎన్నికలు జరిగి ప్రభుత్వం ఏర్పడిన కొన్ని నెలలతర్వాత, అశోక్ లవసా కుటుంబాన్ని తీవ్రంగా హింసించారు. ఆయన నిరసన వ్యక్తం చేసినందుకు గాను తగిన మూల్యం చెల్లించవలసి వచ్చింది. సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్రప్రభుత్వం తక్షణం స్పందించి సీఈసీని, సభ్యులను ప్రజాస్వామికంగా, పారదర్శకంగా నియమించడానికి వీలుగా పార్లమెంటు చట్టంచేయాలి. ఈ తీర్పు దేశ స్వాతంత్ర్యాన్ని, ఎన్నికల కమిషన్ బలోపేతం చేసేందుకు, చట్టంచేయడం సానుకూలమైనచర్య అవుతుంది. భారత ప్రజా స్వామ్యవ్యవస్థలో స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు నిర్వహించడానికి ఇది తప్పనిసరి.

డా. సోమ మర్ల

గోదావరి-కావేరి అనుసంధానం మిగులు జలాలకు ఎసరు?

వి. శంకరయ్య

బిడ్డ చనిపోయినా పురిటి వాసన పోలేదనేది సామెత. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అదేవిధంగా వ్యవహరిస్తున్నారు. తమిళనాడు కేరళలో పాగా వేసే మరులు ఇంకా పోయినట్లు లేదు. లేకుంటే ఇప్పుడు గోదావరి కావేరి అనుసంధానం తెర మీదకు ఎందుకు తెచ్చినట్లు? పైగా ప్రత్యామ్నాయ మైన ప్రతి పాదనల్లో పోలవరం కాలువ ఉపయోగించుకోమని ఈ నెల 6 వతేదీ జరిగిన నదుల అనుసంధానం టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆంధ్ర ప్రదేశ్ చెప్పడం గోదావరి మిగులు జలాలను నీళ్లు వదులు కోవడమే . ఏ నదీ లోయలో గాని ఆ ప్రాంత ప్రజల అవసరాలు పూర్తిగా తీరిన తరువాత మిగులు నీరు వుంటే ఇతర నదీ లోయ ప్రాంతాలకు తరలించాలనేది సహజ న్యాయ సూత్రం. గతంలో నెహ్రూ హయాంలో డాక్టర్ కె.ఎల్. రావు, నరసింహారావు గంగా కావేరి అనుసంధానం ప్రతి పాదించిన సమయంలో తీవ్ర చర్చ జరిగింది. ఆయా నదీ లోయ ప్రాంత ప్రజల అవసరాల అంచనాలు తేల్చ లేక తుదకు ఎక్కడికక్కడ నదీలోయల్లో ప్రాజెక్టులు నిర్మించాలనే నిర్ణయాని కొచ్చారు. ఇప్పుడు గోదావరిలో మిగులు జలాలు లేవని కేంద్రం జలసంఘం అధికారికంగా టాస్క్ ఫోర్స్ కమిటీకి తేల్చి చెప్పింది. అయినా పట్టువదలని విక్రమార్కునిలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదంటే పైగా జాతీయంగానూ అంతర్జాతీయంగా అనుసరిస్తున్న సహజ న్యాయ సూత్రం ఉల్లంఘిస్తున్నదంటే దాని దుర్బుద్ధి తప్ప మరొకటి కాదు. గోదావరిలో దిగువ రాష్ట్రమైన ఎపికు మాత్రం చెందవలసిన మిగులు జలాలకు ఎసరు పెట్టడమే. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరిస్తే భవిష్యత్తు తరాల గొంతు నిలువునా కోయడమే.

అయితే టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ వెదిరె శ్రీరాం ఛత్తీస్‌ఘడ్ ఉపయోగించుకొనని 140 టీఎంసీల నికర జలాలను తరించుతామంటున్నారు. కాని ఛత్తీస్‌ఘడ్ ఈ పాటికే అంగీకరించలేదు. తత్ఫలితంగా ఈ సమావేశానికి ఛత్తీస్‌ఘడ్‌ను ఆహ్వానించ లేదు. వాస్తవంలో ఇందులో ఆసక్తికర మతలబు వుంది. గతంలో ఛత్తీస్‌ఘఢ్‌లో బిజెపి ప్రభుత్వం వున్న సమయంలో ఇందుకు అంగీకరించింది. ఆ సమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ అడ్డం తిరిగారు. 1989 లో జాతీయ జల అభివృద్ధి సంస్థ ప్రతిపాదించిన తొమ్మిది అనుసంధానాల్లో తొలిదైన మహానది గోదావరి అనుసంధానం చేపడితే తప్ప గోదావరి కావేరి అనుసంధానానికి అంగీకరించేది లేదని తెగేసి చెప్పారు. అయితే ఇప్పుడు ఒక మెట్టు దిగినట్లువుంది. ఇందుకు కారణం తెలంగాణకు చెందిన టాస్క్ ఫోర్స్ కమిటీ చైర్మన్ కారణం! ఈ ఎపి సోడ్ మరల చర్చించుకొందాం.

ప్రస్తుతం ఛత్తీస్‌ఘడ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వముంది. ఆ ప్రభుత్వం ఇందుకు ససేమిరా అంటోంది. అందుకే ప్రధాన మంత్రి డీల్ చేస్తున్నట్లు వెదిరె శ్రీ రాం చెప్పు కొచ్చారు. దీన్ని బట్టి పరిశీలిస్తే గోదావరి కావేరి అనుసంధానం యెడల ప్రధానమంత్రి ఎంత ఆసక్తి చూపుతున్నారో అవగతమౌతుంది.

1989లో జాతీయ జల అభివృద్ధి సంస్థ తొమ్మిది అనుసంధానాలను ప్రతి పాదన చేసింది. మహానది (మణిభద్ర) గోదావరి (ధవళేశ్వరం). మహానది నుండి 823 కిలోమీటర్ల కాలవ తవ్వితే ధవళేశ్వరం వద్ద అంతమౌతుంది. 400 టియంసిలు తరలించగా మార్గం మధ్యలో 200 టియంసిలు వినియోగించగా 230 టియంసిలు ధవళేశ్వరం చేరుతాయని గోదావరి నుండి మిగిలిన ఎనిమిది అనుసంధానాలను ప్రతిపాదించారు.

ఆదిలోనే దీనికి సంధి కొట్టింది. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా ఒడిషా అంగీరించలేదు. గమనార్హమైన అంశమేమంటే ఇటీవల జరిగిన సమావేశాల్లో ధవళేశ్వరం వద్ద 230 టియంసిలు చేరి ప్రయోజన మేమని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అభ్యంతరం పెట్టింది. కాగా నిన్న మొన్నటి వరకు మహానది గోదావరి అనుసంధానం జరిగితే తప్ప తాము గోదావరి కావేరి అనుసంధానానికి అంగీకరించేది లేదని చెప్పొవచ్చిన కెసిఆర్ సర్కార్ ఈ నెల 6 వతేదీ జరిగిన సమావేశంలో మెత్త బడింది. గోదావరిలో మిగులు జలాలు వుంటే (వాటిపై తెలంగాణకు హక్కు లేదు. ఎపికి మాత్రమే వుంది) అనుసంధానం చేయవచ్చని పైకి చెబుతూ మరో షరతు విధించింది. గోదావరి నదిపై తాము సమర్పించిన ప్రాజెక్టుల డిపిఆర్ ఆమోదించాలని కోరింది. డిపిఆర్ లు ఆమోదించుతామని చెప్పినట్లు వెదిరె శ్రీ రాం ప్రకటించడం కొసమెరుపు. ఎందుకంటే గోదావరి నదిపై నిర్మాణానికి తెలంగాణ తలపెట్టిన ప్రాజెక్టుల డిపిఆర్ ఆమోదించ వద్దని ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం పెట్టి వుంది. ఇవి ఆమోదం పొందితే నష్టపోయేది ఆంధ్రప్రదేశ్ మాత్రమే.

ఒక పక్క గోదావరిలో మిగులు జలాలు లేవని కేంద్ర జల సంఘం చెబుతోంది. మరో వేపు గోదావరి నదిలో ఎవరి వాటా ఎంతో తేలలేదు. గోదావరి ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1480 టియంసిలు కేటాయించింది. ఇందులో తమ వాటా 967 టియంసిలని ఎపి వాటా 510 టియంసిలు మాత్రమే నని తెలంగాణ వాదిస్తోంది. ఆ మేరకు ప్రాజెక్టులను రూపొంది డిపిఆర్ లు సిద్ధం చేసింది. కాని ఆంధ్రప్రదేశ్ తమ వాటా 775 టియంసిలని తెలంగాణ వాటా 650 టియంసిలని వాదిస్తోంది. ఈ అంశం తేల్చేందుకు ట్రిబ్యునల్ వేయాలనే ప్రతి పాదన వున్న దశలో తెలంగాణకు చెందిన టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ చొరవతో ఏదో రూపంలో గోదావరి కావేరి అనుసంధానం పూర్తి చేసి ప్రధాన మంత్రి మోదీ ఆశయం నెరవేర్చేందుకు గోదావరిపై తెలంగాణ ప్రతిపాదన చేసిన ప్రాజెక్టుల డిపిఆర్ ఆమోదం పొందే అవకాశం వుంది. ఇదే జరిగితే గోడ దెబ్బ చెంప దెబ్బ రెండూ ఆంధ్రప్రదేశ్‌కు తప్పదు. తెలంగాణ కోరినట్లు తన వాటా నీళ్లు దక్కించుకొంటుంది. మరో వేపు నీటి ఎద్దడి రోజుల్లో దిగువ రాష్ట్రమైన ఎపికి మాత్రమే చెంద వలసిన మిగులు వరదజలాలు తమిళనాడు, కేరళ దక్కించుకొంటాయి. టిడిపి హయాంలో ప్రతిపాదన చేసిన నదుల అంతర్గత నదుల అనుసంధానం మేరకు గోదావరి మిగులు వరద జలాలు 300 టియంసిల ఎపికి హుష్ కాకి అవుతాయి. అటు ఇటు దాదాపు 80 టియంసిలతో ఆంధ్రప్రదేశ్ సంతృప్తి చెందవలసి వస్తుంది. ముమ్ముందు రానున్న ఈ పెను ప్రమాదం రాష్ట్రంలోని ప్రతిపక్షాలు సాగునీటి రంగ నిపుణులు జాగ్రత్తపడకపోతే అందరూ కలిసి భవిష్యత్తు తరాలకు తీవ్ర అన్యాయం చేసిన వారౌతారు.

ఇంతకీ ఈ నదుల అనుసంధానానికున్న పూర్వ చరిత్ర చూస్తే 1989 లో జాతీయ జల అభివృద్ధి సంస్థ తొమ్మిది అనుసంధానాలను ప్రతి పాదించింది. 1901-02 నుండి 1981-02 సంవత్సరాల మధ్య ప్రవాహ గణాంకాలు గోదావరిలో 75 శాతం నీటి లభ్యత మేరకు శ్రీ రాం సాగర్ ఇచ్చంపల్లి మధ్య 2337.59 టియంసిలు వున్నాయని ఇచ్చంపల్లి వద్ద 717 టియంసిలు మిగులు వుంటాయని లెక్కగట్టి తొమ్మిది అనుసంధానాలను 1989 లో ప్రతిపాదించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఒడిషా అంగీకరించక పోవడంతో ఈ ప్రతిపాదన అటకెక్కింది. తెలంగాణ ఏర్పడిన తదుపరి మరో సర్వే జరిగింది. 2001-02 నుండి 2010-11 మధ్య గోదావరిలో 75 శాతం నీటి లభ్యత మేరకు 2108-5 టియంసిలుగా తేలింది. పైగా ఇచ్చంపల్లి నుండి 140 టియంసిలు కిందకు వదిలితేనే రెండు రాష్ట్రాల అవసరాలు తీరుతాయని తేలింది. వాస్తవంలో ఈ లోపు తెలంగాణ చాలా పథకాలను ప్రతిపాదించింది. ఈ అంశంలో తెలంగాణతో పోల్చుకొంటే తెలంగాణ కన్నా అటు గోదావరి ఇటు కృష్ణ నదుల అంశంలో ఆంధ్రప్రదేశ్ నక్కకు నాగలోకానికొ ఉన్న తేడా చందంగా వుంటుంది. మొన్న 6 వతేదీ జరిగిన సమావేశంలో 75 శాతం నీటి లభ్యత కన్నా 50 శాతం నీటి లభ్యత లెక్కగట్టాలని తమిళనాడు అధికారి కోరారు. అదీ నీటియావ అంటే. ఇందు వలన నష్టపోయేది ఆంధప్రదేశ్ మాత్రమే. అయినా పోలవరం కాలువ ఉపయోగించుకోమని ఆంధ్రప్రదేశ్ అధికారులు కోరారంటే ఆంధ్ర ప్రదేశ్ ప్రజల క్షేమం కన్నా ప్రధాన మంత్రి మోదీ వద్ద మార్కులు వేసుకోవచ్చని తప్ప వేరు కాదు. మరో అంశం లేక పోలేదు. దేశంలో నదుల అనుసంధానానికి అంగీకరించే రాష్ట్రాలకు ప్రత్యేక నిధులు రాయితీల అప్పులు ఇవ్వమని కేంద్ర జలశక్తి శాఖ స్థాయీసంఘం ఇటీవల సిఫార్సు చేసివుంది.

విశ్రాంత పాత్రికేయులు, 9848394013

కిరాతక నేరగాళ్ల మధ్య సిసోడియా!

- ప్రాణాలకు ముప్పుందని 'ఆప్' ఆందోళన
- అదేం లేదంటున్న తీహార్ జైలు అధికారులు

న్యూఢిల్లీ: దిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణంలో అరెస్టయి జ్యుడిషియల్ కస్టడీపై తీహార్ జైలులో ఉన్న దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని ఆ పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తీహార్ జైలులో సిసోడియాను ప్రమాదకర నేరస్థుల మధ్య ఉంచినట్టు ఆ పార్టీ నేత సంజయ్ సింగ్ మీడియాకు వెల్లడించారు. సిసోడియాకు విపాసన సెల్ కూడా నిరాకరించేంతటి పగ 'ఆమ్ ఆద్మీ పార్టీ'పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఉందన్నారు. ప్రస్తుతం సిసోడియాను జైలులో అత్యంత కిరాతక నేరస్తుల మధ్య ఉంచినట్టు చెప్పారు. లక్షలాది మంది పిల్లలకు మంచి విద్య అందించాలని అనుకోవడమే సిసోడియా చేసిన ఏకైక నేరమని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఆప్ జాతీయ అధికార ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్ సైతం మనీశ్ సిసోడియాకు జైలులో మెడిటేషన్ సెల్ ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టారు. తనను మెడిటేషన్ సెల్‌లో ఉంచాలని సిసోడియా చేసిన విజ్ఞప్తికి కోర్టు కూడా అంగీకారం తెలిపిందని, అయినప్పటికీ ఆయనను జైలు నెబర్-1లో ఉంచారని, దీనికి కేంద్రం సమాధానం ఇవ్వాలని ఆయన నిలదీశారు. కాగా, సిసోడియాకు జైలు నెంబర్-1లోని సీనియర్ సిటిజన్స్ సెల్‌లో ఉంచారు. ఆయన తనతో పాటు భగవద్గీత, కళ్లజోడు, మందులు తీసుకువెళ్లేందుకు కోర్టు అనుమతించింది. విపాసనా సెల్‌లో ఉంచాలన్న సిసోడియా అభ్యర్థను జైలు అధికారులు పరిశీలించాలని కూడా కోర్టు అదేశించింది. తీహార్ జైలుకు తరలించిన సిసోడియాను అక్కడే ఈడీ అధికారులు... మంగళవారం ప్రశ్నించారు. ఈ కేసులో సిసోడియా సన్నిహితుడు (పీఎస్) దేవేందర్ శర్మను కూడా సీబీఐ ప్రశ్నించింది. కాగా, సిసోడియా బెయిలు పిటిషన్ ఈనెల 10న విచారణకు రానుంది. కాగా ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపణలను 'నిరాధారం' అని తీహార్ జైలు అధికారులు తోసిపుచ్చారు. మనీశ్ సిసోడియాను తీహార్ సెంట్రల్ జైలు నంబర్-1 వార్డులో ఉంచారని, అక్కడ కనీస సంఖ్యలో ఖైదీలు మాత్రమే ఉన్నారని, గ్యాంగ్‌స్టర్లు లేరని జైలు అధికారులు స్పష్టం చేశారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, జాతీయ అధికార ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్ చేసిన ప్రకటనల తర్వాత జైలు అధికారులు స్పందించారు. సిసోడియా భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక వార్డు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇచ్చట ఎటువంటి ఆటంకం లేకుండా ధ్యానం లేదా ఇతర కార్యకలాపాలు చేయడానికి వీలుంటుందని పేర్కొన్నారు. 'జైలు నిబంధనల ప్రకారం ఆయన భద్రత నిర్ధారించడానికి అన్ని ఏర్పాట్లు ఉన్నాయి. అతని బసపై ఎటువంటి అపోహలకు తావులేదు' అని ఒక అధికారి తెలిపారు.

సైనికుల హోలీ సంబరాలు

శ్రీనగర్ : ఇక్కడ దాల్‌గేట్ ప్రాంతంలోని ఒక సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ప్రధాన కార్యాలయంలో బుధవారం సైనికులు ఉత్సాహంగా హోలీ జరుపుకున్నారు. ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ బాలీవుడ్ సినీ గీతాలకు నృత్యం చేశారు. తమ కుటుంబాలకు దూరంగా ఉన్నప్పటికీ, జవాన్లు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ, స్వీట్లు పంచుకుంటూ ఉత్సాహంగా ఉన్నారు. 'కష్టపడి పనిచేసే సైనికుడు కూడా పూర్తిగా ఆనందిస్తాడు' అని బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ విజయ్ ఖతానా పీటీఐకి చెప్పారు. బెటాలియన్‌లోని చాలా మంది సిబ్బంది నగరంలోని సున్నితమైన డౌన్‌టౌన్ ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్నారు. రంగుల పండుగను పురస్కరించుకుని జవాన్లు, అధికారులు అందరూ ఒకే కుటుంబంగా ఉండి పదవులకు హద్దులు లేని రోజున ఒకరికొకరు ముచ్చటించారు. సాయుధ దళ సిబ్బంది తమ కుటుంబాలకు దూరంగా ఉన్నారని, అయితే బెటాలియన్ తమ కుటుంబమని ఖతానా చెప్పారు. 'మేము దాదాపు తొమ్మిది నుంచి 10 నెలల పాటు బెటాలియన్‌లో ఉంటాము. ఇది మా కుటుంబంలో భాగం. మేము ఒకరినొకరు జాగ్రత్తగా చూసుకుంటాయి. దీనిని కుటుంబంగా మాత్రమే చూస్తాము. వారు (జవాన్లు) వారి కుటుంబ సభ్యుల నుంచి ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ పొందుతారు. ఇది కుటుంబయేతర ప్రాంతం అయినందున, మేము వారి కుటుంబాలకు వసతి కల్పించే స్థితిలో లేము. కానీ, వారికి సెలవు కావాల్సి వచ్చినప్పుడు వారు వారి ఇంటికి వెళ్లేలా మేము దానిని మంజూరు చేస్తాము' అని ఆయన అన్నారు. సిబ్బంది వివిధ రాష్ట్రాలు, సంస్కృతులకు చెందినవారు కావచ్చు కానీ వారు యూనిఫాం ధరించినప్పుడు వారి వ్యక్తిగత గుర్తింపును కోల్పోతారని తెలిపారు. 'సీఆర్‌పీఎఫ్‌ని సాధారణంగా మినీ-ఇండియా అని పిలుస్తారు. మేము వివిధ నేపథ్యాలు, విభిన్న మతాలు, కులాలు, మతాలు, భాషల నుంచి వచ్చాము. అయితే మనం ఈ యూనిఫాం ధరించినప్పుడు, మేము మా వ్యక్తిగత గుర్తింపును తొలగిస్తాము. ఈ యూనిఫాం మా గుర్తింపు' అని ఖతానా చెప్పారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆదేశ్ కుమార్ మాట్లాడుతూ 'మేము హోలీ, ఇతర పండుగలను కలిసి జరుపుకుంటాము. ఈ బెటాలియన్ మా కుటుంబం' అని అన్నారు. సిపాయి భాస్కర్ చద్దా దళాన్ని 'మా అతిపెద్ద కుటుంబం'గా అభివర్ణించారు. 'మేము రెండు, మూడు నెలలు ఇంట్లోనే ఉంటాము. కానీ మేము ఎక్కువ సమయం గడిపేది ఇక్కడే' అని తెలిపారు. కుటుంబాలు వారి జీవితంలో పెద్ద భాగం. అయితే జవాన్లకు బెటాలియన్ అనేది సంతోషం, దుఃఖం రెండింటిలోనూ నిజమైన కుటుంబం.

ఎయిరిండియాలోనే మహిళా పైలట్లు అధికం

న్యూఢిల్లీ: ప్రముఖ విమానయాన సంస్థ, టాటాల నేతృత్వంలో ఉన్న ఎయిరిండియాలో పనిచేస్తున్న మొత్తం పైలట్లలో 15 శాతం మంది మహిళలే ఉన్నారని ఆ సంస్థ తెలిపింది. అత్యధిక మహిళా పైలట్లు కలిగిన సంస్థ తమదేనని వెల్లడించింది. దేశంలో ఎయిరిండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఎయిర్ ఆసియా విమాన సంస్థలను టాటా గ్రూప్ నడుపుతోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 90కి పైగా దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను మార్చి 1 నుంచి కేవలం మహిళా సిబ్బందితో నడుపుతున్నట్లు ఎయిరిండియా తెలిపింది. ఇందులో కేబిన్ సిబ్బందితో పాటు కాక్‌పిట్ సిబ్బంది కూడా మహిళలేనని పేర్కొంది. ఎయిరిండియాలో మొత్తం 1825 మంది పైలట్లు ఉండగా.. అందులో 275 (15శాతం) మంది మహిళలే ఉన్నారని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఎయిరిండియాలో పనిచేస్తున్న మొత్తం సిబ్బందిలోనూ 40 శాతం వారే ఉన్నారని పేర్కొంది. ప్రపంచంలోనే అత్యధిక కేబిన్ సిబ్బంది, మహిళా పైలట్లు కలిగిన సంస్థ తమదేనని ఎయిరిండియా సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ క్యాంప్‌బెల్ విల్సన్ పేర్కొన్నారు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఎయిర్ ఏషియా ఇండియాలోనూ మూడో వంతు సిబ్బంది మహిళలేనని టాటా గ్రూప్ తెలిపింది.

త్రిపుర సీఎంగా మాణిక్ సాహా ప్రమాణం

- రెండవసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించిన బీజేపీ నేత
- 9 మందితో మంత్రివర్గం... నలుగురు కొత్త ముఖాలకు స్థానం

అగర్తలా : సున్నిత సరిహద్దు రాష్ట్రమైన త్రిపుర ముఖ్యమంత్రిగా 70 ఏళ్ల బీజేపీ నాయకుడు మాణిక్ సాహా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి పీఠాన్ని ఆయన రెండవ సారి అధిష్టించారు. రతన్ లాల్ నాథ్, పరన్‌జిత్ సింఘా రాయ్, శంతన చక్మా, వికాస్ దెబ్బర్మ, శుక్లా చరణ్ నోటియా సహా ఎనిమిది మంది మంత్రులతో గవర్నర్ సత్యదేవ్ నరేన్ ఆర్య ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్ బీరేన్ సింగ్ కార్యక్రమానికి అతిథులుగా హాజరయ్యారు. మొత్తం మంత్రివర్గ సభ్యులలో బీజేపీ నుంచి ఎనిమిది మంది, తన మిత్రపక్షమైన ఐపీఎఫ్‌టీ నుంచి ఒకరు ఉన్నారు. పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర నుంచి నోటియా ఉన్నారు. 9 మందితో కూడిన కేబినెట్‌లో నలుగురు కొత్త ముఖాలకు చోటు దక్కింది. అయితే అంతకుముందు మంత్రివర్గంలో పని చేసిన ఐదుగురికి తాజా కూర్పులో స్థానం దక్కింది. కాగా గత కేబినెట్‌లో ఉన్న భగ్బన్ దాస్, మనోజ్ కాంతి దేవ్, రామ్ ప్రసాద్ పాల్, రాంపద్ జమాటియాకు రెండవసారి బీజేపీ-ఐపీఎఫ్‌టీ ప్రభుత్వంలో చోటు లభించలేదు. మాణిక్ సాహా కొత్త మంత్రివర్గంలో ముగ్గురు గిరిజన ఎమ్మెల్యేలకు స్థానం లభించింది. సెపాహిజాలా జిల్లాలోని ధన్పూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికయిన కేంద్ర మంత్రి ప్రతిమా భౌమిక్ ప్రమాణ స్వీకారం చేయలేదు. అయితే మూడు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఎన్నికల అనంతరం జరిగిన హింసకు నిరసనగా ప్రతిపక్ష వామపక్ష, కాంగ్రెస్ పార్టీలు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బహిష్కరించాయి. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిర్జిత్ సిన్హా మాట్లాడుతూ ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న హింసకు నిరసనగా మాణిక్ సాహా ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బహిష్కరించామని తెలిపారు. తిప్ర మోతాకు చెందిన 13 మంది ఎమ్మెల్యేల్లో ఎవరూ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కనిపించలేదు. కానీ పార్టీ అధినేత ప్రద్యోత్ కిషోర్ మాణిక్య దెబ్బర్మ సోషల్ మీడియాలో 'తిప్రా రాజీ పడలేదు! వెయిట్ అండ్ వాచ్' అని పేర్కొన్నారు. 'మన రాజ్యాంగ పరిష్కారం కోసం భారత ప్రభుత్వాన్ని కలవమని నేను కచ్చితంగా అనుకుంటున్నాను. మేము 14 లక్షల మంది టిప్రాసాల హక్కుల గురించి మాత్రమే మాట్లాడతాము. మా నాయకుల వ్యక్తిగత ప్రయోజనాల గురించి కాదు' అని ఫేస్‌బుక్ వేదికగా అన్నారు. త్రిపురలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ 32 సీట్లను గెలుచుకుంది. అయితే దాని మిత్రపక్షమైన ఐపీఎఫ్‌టీ కేవలం ఒక్క స్థానమే దక్కించుకుంది. త్రిపురలో శాంతిభద్రతల పరిస్థితి క్షీణిస్తున్న నేపథ్యంలో విప్లవ్ కుమార్ దేవ్‌కు ప్రజాదరణ పడిపోతున్న పరిస్థితిని గమనించిన బీజేపీ ఆయన స్థానంలో 2022లో మాణిక్ సాహా ముఖ్యమంత్రిని చేసింది.

న్యాయం అందరికీ సమానంగా ఉండాలి

సీజేఐకి కర్ణాటక న్యాయవాదుల లేఖ

బెంగళూరు : తన కుమారుడు ఎం.వి.ప్రశాంత్ కుమార్ ద్వారా లంచం వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎమ్మెల్యే మాదాల్ విరూపాక్షప్ప మధ్యంతర ముందస్తు బెయిల్ దరఖాస్తును త్వరగా మంజూరు చేయడంపై బెంగళూరులోని న్యాయవాదుల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ (కేఎస్‌డీఎల్) చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసిన ఎమ్మెల్యేకు మంగళవారం హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. బెంగళూరు వాటర్ సప్లై అండ్ సీవరేజ్‌లో చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఉన్న ఆయన కుమారుడు ప్రశాంత్ గత గురువారం రూ.40 లక్షలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో లోకాయుక్త విరూపాక్షప్పను మొదటి ముద్దాయిగా పేర్కొంది. ఆ తర్వాత జరిపిన దాడుల్లో బంగారు ఆభరణాలు, వెండి, భూమి పెట్టుబడి వివరాలు లభించడంతో పాటు రూ.8.23 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కు రాసిన లేఖలో సంఘం అధ్యక్షుడు వివేక్ సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.జి.రవి నేతృత్వంలోని సంఘం... న్యాయం అందరికీ సమానంగా ఉండాలన్న విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించింది. 'కర్ణాటక హైకోర్టులో సాధారణ కసరత్తు ఏమిటంటే, ముందస్తు బెయిల్ వంటి కొత్త విషయాలు మంజూరు చేయడానికి చాలా రోజులు, వారాలు పడుతుంది. అయితే వీఐపీ విషయాలు రాత్రికి రాత్రే జరిగిపోతాయి' అని న్యాయవాదుల సంఘం వారి లేఖలో పేర్కొంది. ఈ పద్ధతి వల్ల సామాన్యులకు న్యాయ వ్యవస్థపై నమ్మకం పోతుందని, ఎమ్మెల్యేను కూడా సామాన్యుడిలా చూడాలని సంఘం సూచించింది.

హోలీ సంబరాలపై ఆంక్షలు...

దిల్లీ వర్సిటీ విద్యార్థినుల ఆగ్రహం

న్యూఢిల్లీ: హోలీ పండుగ సందర్భంగా అమలు చేస్తున్న ఆంక్షలపై దిల్లీ విశ్వవిద్యాలయంలోని రాజీవ్‌గాంధీ బాలికల వసతి గృహం విద్యార్థినులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం 6 గంటల వరకు హాస్టల్ ప్రాంగణం బయటకు వెళ్లకూడదని తమపై ఆంక్షలు విధించారని ఆరోపిస్తూ, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ విశ్వవిద్యాలయానికి చెందిన ఓ సెక్షన్ ఆఫీసర్ మార్చి 2న విడుదల చేసిన నోటీసులో...ఈ వసతి గృహంలో ఉంటున్న విద్యార్థినులు హోలీ పండుగ రోజున సాయంత్రం ఆరు గంటల తర్వాత మాత్రమే బయటకు వెళ్లడానికి వీలుంటుందని తెలిపారు. ఆ రోజున అతిథులు లేదా సందర్శకులను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఈ ఆంక్షలు సమర్థనీయం కాదని విద్యార్థినులు విమర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేళ తమను హాస్టళ్లకే పరిమితం చేశారని దుయ్యబట్టారు. తాము బయటకు వెళ్లకుండా గేట్లకు తాళాలు వేశారన్నారు. ఈ చర్యలు నిరంకుశమైనవని మండిపడ్డారు. దీనిపై విశ్వవిద్యాలయం ప్రాక్టర్ రజిని అబ్బి స్పందిస్తూ ఈ నోటీసును యేటా పంపిస్తామని, విద్యార్థినులు సంతకం చేసి, బయటకు వెళ్లవచ్చని చెప్పారు. ఎంఏ ఫైనల్ ఇయర్ విద్యార్థిని దీపాంషి మాట్లాడుతూ అబ్బాయిల హాస్టల్‌లో ఇటువంటి ఆంక్షలు లేవన్నారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న ఇతర హాస్టళ్లలోని తమ తోటి విద్యార్థినులతో సైతం మాట్లాడటానికి అవకాశం ఇవ్వడం లేదన్నారు. తమ కుటుంబ సభ్యుల పేర్లు, కాంటాక్ట్ నంబర్స్ ఇవ్వాలని అధికారులు కోరుతున్నారన్నారు. ఆహార పదార్థాలు తెచ్చుకుందామన్నా సంతకం పెట్టాలని డిమాండ్ చేస్తున్నారన్నారు.

పాక్ జైళ్లలో మగ్గుతున్న మత్స్యకారులు

- మావారిని విడిపించే పార్టీకే ఓటేస్తాం
- గుజరాత్ తీరప్రాంత బాధిత కుటుంబాలు

కచ్ (గుజరాత్): మాకు అలవెన్సులు లేదా ఎన్నికల వాగ్దానాలపై ఆసక్తి లేదు... నాకు మా అబ్బాయి తిరిగి కావాలి. నేను అతనిని గత రెండేళ్లుగా చూడలేదంటూ పాకిస్తాన్ జైలులో మగ్గుతున్న మత్స్యకారుడు అంకిత్ తల్లి 56 ఏళ్ల అంకిత థపారియా అన్నారు. పొరుగు దేశపు సముద్ర జలాల్లో ప్రవేశించినందుకు పాక్ భద్రతా బలగాలు అంకిత్‌ను అరెస్టు చేశాయి. గుజరాత్ తీర ప్రాంతానికి చెందిన 655 మంది మత్స్యకారుల కుటుంబాల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు, ముఖ్యంగా సౌరాష్ట్ర, పోర్ బందర్, వెరల్, ద్వారకా మరియు మాంగ్రోల్ ప్రాంతాలకు చెందినవారు రూడా గత కొన్నేళ్లుగా పాకిస్తాన్ జైళ్లలో మగ్గుతున్నారు. గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో డిసెంబర్ 1, 5 తేదీల్లో జరగనున్నాయి. అయితే పాకిస్తాన్ జైళ్లలో ఉన్న మత్స్యకారుల కుటుంబ సభ్యులు ఏం చెబుతున్నారంటే.... రాబోయే ఎన్నికల్లో తమ బంధువులను పొరుగు దేశం నుండి తిరిగి తీసుకురావడానికి హామీ ఇచ్చే పార్టీలకు ఓటు వేస్తామని చెప్పారు. 'ఎన్నికలు వస్తాయి, పోతాయి... రాజకీయ పార్టీలు మా పిల్లలను తిరిగి తీసుకువస్తామని హామీ ఇచ్చారు కానీ ఏదీ ముందుకు సాగడం లేదు. వారు సజీవంగా ఉన్నారా లేదా చనిపోయారో కూడా మనకు తెలియదు. కుటుంబంలో నా మనుమడు మాత్రమే సంపాదిస్తున్న వ్యక్తి. ఇప్పుడు అతను మూడు సంవత్సరాలు పాకిస్తాన్ జైలులో ఉన్నాడు. నా మనుమడు క్షేమంగా తిరిగి వస్తాడని హామీ ఇచ్చే వారికే మేము ఓటేస్తాం" అని మంగ్రోల్‌కు చెందిన 72 ఏళ్ల గోవింద్‌భాయ్ తెలిపారు. అతని మనవడు రెండు సంవత్సరాల క్రితం పాకిస్తాన్ బలగాలకు పట్టుబడ్డాడు. ఇతని మాదిరిగానే గత మూడు సంవత్సరాలుగా పాకిస్తాన్ జైలులో ఉన్న లీలాబెన్, ద్వారకా తీర ప్రాంతంలో పట్టుబడ్డాడు. మొదటిసారి పట్టుబడిన మత్స్యకారుల కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ. 300 మాత్రమే భృతిని అందజేస్తుంది. .'నా భర్త ప్రతి నెలా దాదాపు రూ.30,000 సంపాదించేవాడు. ఇప్పుడు మాకు నెలకు దాదాపు రూ.9,000 అలవెన్స్‌గా లభిస్తోంది. మాది ఆరుగురు ఉన్న కుటుంబం. కుటుంబాన్ని నడపాలంటే దూరప్రాంతాల్లో పనిమనిషిగా పనిచేయాల్సి వస్తోంది. భృతికి అర్హులు కానందున, రెండవసారి పట్టుబడిన వారి కుటుంబాల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది"అని ఆమె అన్నారు. అఖిల భారతీయ మత్స్యకారుల సంఘం జాతీయ అధ్యక్షుడు వెల్జిభాయ్ మసాని గుజరాత్ ప్రభుత్వ కట్టుబాటును వివరిస్తూ... "మొదటిసారి పాకిస్తాన్ జలాల్లో అరెస్టు చేయబడిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రోజుకు రూ.300 రూపాయల భత్యం మాత్రమే అందిస్తుంది. అదే రెండోసారి పట్టుబడితే ప్రభుత్వం ఎటువంటి భత్యం అందించదు. మీరు మొదటిసారిగా పాకిస్తాన్ జలాల్లోకి ప్రవేశించినట్లయితే, అది అనుకోని పొరపాటుగా పరిగణించబడుతుంది. కానీ రెండోసారి పట్టుబడితే మాత్రం ఉద్దేశపూర్వకంగా చేసినట్టు లెక్క" అని ఆయన అన్నారు. గుజరాత్ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన సమాచారం ప్రకారం... ఈ ఏడాది మార్చి నాటికి రాష్ట్రానికి చెందిన దాదాపు 519 మంది మత్స్యకారులు పాకిస్తాన్ జైళ్లలో మగ్గుతున్నారు. ఈ మత్స్యకారులు ఏడాది నుంచి ఐదేళ్లపాటు పాకిస్తాన్ జైళ్లలో ఉన్నారు. 'ప్రస్తుతం, గుజరాత్ తీరప్రాంతం నుండి పట్టుబడిన దాదాపు 655 మంది మత్స్యకారులు పాకిస్తాన్ జైళ్లలో ఉన్నారు. గత కొన్ని నెలలుగా ఈ సంఖ్య పెరిగింది. మత్స్యకారులను తిరిగి తీసుకురావడానికి నేను పాకిస్తాన్‌కు వెళ్లాను, కానీ విఫలమయ్యాను. నేను ట్రాలర్‌లను తిరిగి తీసుకురాగలిగాను. కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది, కానీ పాకిస్తాన్ చర్య తీసుకోవాలి. అనేక కేసుల్లో పాక్ కోర్టులు ఈ మత్స్యకారులను విడుదల చేసినా అధికారులు సుముఖంగా లేరు' అని మసానీ పీటీఐకి చెప్పారు. దాదాపు 10,000 మంది ఓటర్లు ఉన్న మత్స్యకారుల కుటుంబాలు గుజరాత్ తీరప్రాంతంలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరిలో, 356 మంది భారతీయ మత్స్యకారులను, ఇద్దరు పౌర ఖైదీలను విడుదల చేసి స్వదేశానికి రప్పించాలని భారత ప్రభుత్వం పాకిస్తాన్‌ను కోరింది, వీరి జాతీయత ఇప్పటికే నిర్ధారించినట్లు పాకిస్తాన్ అధికారులకు తెలియజేసింది.

దేశ శ్రేయస్సు కోసం కేజ్రీవాల్ ప్రార్థన



న్యూఢిల్లీ: దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దేశ శ్రేయస్సు కోసం ధ్యానం, ప్రార్థనలు ప్రారంభించారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఆయన మెడిటేషన్ ప్రారంభించి, సాయంత్రం 5 గంటల వరకు ఏడు గంటల పాటు కొనసాగించారు. ఈ కార్యక్రమం ప్రారంభించే ముందు కేజ్రీవాల్ రాజ్ ఘాట్ వద్ద మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. మంచి పనులు చేసే వారిని అరెస్టు చేస్తున్నారని, దేశాన్ని దోచుకునే వారు తప్పించుకుంటున్నారని, హోలీ రోజున దేశం కోసం ప్రార్థిస్తానని కేజ్రీవాల్ మంగళవారం తెలియజేశారు. డిజిటల్ ప్రెస్ కాన్ఫరెన్స్ లో మాట్లాడిన ఆయన దేశంలో నెలకొన్న పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు అధ్వాన్నంగా ఉన్నాయన్న విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. కానీ ఈ ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను మెరుగుపరిచిన మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్ జైలులో ఉన్నారన్నారు. ప్రజలకు మంచి విద్య, మంచి వైద్య సదుపాయాలు కల్పించే వారిని, దేశాన్ని దోచుకునే వారికి అండగా నిలిచే వారిని ప్రధాని జైళ్లలో పెట్టడం ఆందోళన కలిగిస్తోందని కేజ్రీవాల్ విమర్శించారు. తాను బుధవారం) దేశం కోసం ధ్యానం చేసి ప్రార్థిస్తానని తెలిపారు. ఆప్ నేతలు సత్యేంద్ర జైన్, సిసోడియా జైలులో ఉండటంపై తాను ఆందోళన చెందడం లేదని ముఖ్యమంత్రి చెప్పారు. వారిద్దరూ ధైర్యవంతులని, దేశం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉన్నారన్నారని తెలిపారు. కానీ దేశంలో నెలకొన్న దయనీయ స్థితి తనను ఆందోళనకు గురి చేస్తోందన్నారు.

మేఘాలయ స్పీకర్‌గా థామస్ సంగ్మా నామినేషన్

షిల్లాంగ్: మేఘాలయ శాసనసభ స్పీకర్ పదవికి నేషనల్ పీపుల్ పార్టీ (ఎన్‌పీపీ) సీనియర్ నాయకుడు, అధికార మేఘాలయ డెమోక్రటిక్ అలయన్స్ అభ్యర్థి థామస్ ఎ. సంగ్మా నామినేషన్ దాఖలు చేశారు. స్పీకర్ ఎన్నిక మార్చి 9, 2023న జరగనుంది. థామస్ నార్త్ తురల్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు స్పీకర్ పదవికి థామస్ ఒక్కరి నామినేషన్ మాత్రమే స్వీకరించినట్లు అసెంబ్లీ కార్యాలయ అధికారి తెలిపారు. కాన్రాడ్ కె. సంగ్మా నేతృత్వంలోని మేఘాలయ డెమోక్రటిక్ అలయన్స్ (ఎండీఏ)కు 44 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది. ఈ కూటమిలో ఎన్‌పీపీ (25), యూడీపీ (11), బీజేపీ (2), పీడీఎఫ్ (2), సంతంత్రులు (2) ఉన్నారు. కాగా కాబోయే స్పీకర్ అంటూ థామస్ సంగ్మాకు ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. తనను స్పీకర్ పదవికి నామినేట్ చేస్తూ ఎండీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని థామస్ స్వాగతించారు. 'వివిధ హోదాల్లో వారికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు ప్రభుత్వానికి , ప్రజలకు నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఎన్నికల్లో గెలుస్తాననే నమ్మకం నాకు ఉంది' అని థామస్ పీటీఐతో చెప్పారు.

జామా మసీదు మూసివేతపై నిరసన

శ్రీనగర్: షాబ్-ఎ-బరాత్ సందర్భంగా బుధవారం జా మసీదును మూసివేయడం అత్యంత దురదృష్టకర చర్యగా నగరంలోని నౌహట్టా ప్రాంతంలోని జామా మసీదు నిర్వహణ కమిటీ పేర్కొంది. ఈ చర్యను తీవ్రంగా నిరసిస్తున్నట్లు పేర్కొంది మసీదుకు పోలీసులు తాళం వేశారని, షాబ్-ఎ-బరాత్ సామూహిక ప్రార్థనలకు అనుమతించలేదని మసీదు నిర్వాహక సంఘం 'ది అంజుమన్ ఆకాఫ్ జామా మసీదు' పేర్కొంది. కాగా పోలీసుల చర్యపై పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ)అధినేత్రి మెహబూబా ముఫ్తీ ట్విట్టర్‌లో విమర్శలు గుప్పించారు. 'షబ్ ఇ బరాత్ పవిత్ర దినం సందర్భంగా జామా మసీదుకు తాళం వేయడం భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులు, మత స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుంది' అని ఆమె ట్వీట్ చేశారు. అయితే మాజీ ముఖ్యమంత్రి ట్వీట్‌ను ప్రస్తావిస్తూ... ప్రార్థనలు జరగకపోవడానికి తాము కారణం కాదని శ్రీనగర్ పోలీసులు తెలిపారు. 'ఈరోజు జామా మసీదులో షబ్-ఎ-బరాత్ సందర్భంగా రాత్రి ప్రార్థనలతో ప్రభుత్వానికి, పోలీసులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేయడం జరిగింది. అనుమతిని నిరాకరించడానికి ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదు లేదా దానిని ప్రభుత్వం/పోలీసులు అమలు చేయలేదు. దయచేసి పుకార్లు వ్యాప్తి చేయవద్దు' అని పోలీసులు ట్వీట్‌లో పేర్కొన్నారు.

అర్చనా గౌతమ్‌తో అసభ్య ప్రవర్తన

ప్రియాంకాగాంధీ పీఏపై కేసు

మీరట్: కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా వ్యక్తిగత సహాయకుడు సందీప్ సింగ్‌పై వేధింపుల కేసు నమోదైంది. తన కుమార్తెను చంపుతానని సందీప్ బెదిరించినట్లు బిగ్‌బాస్ ఫేమ్, కాంగ్రెస్ నేత అర్చనా గౌతమ్ తండ్రి ఉత్తరప్రదేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి తనకు ఎదురైన ఘటనను వివరిస్తూ అర్చన ఫేస్‌బుక్‌లో వీడియో పోస్టు చేశారు. దీంతో ప్రియాంకా గాంధీ పీఏపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. 'ప్రియాంకాగాంధీ అర్చనాను కలవాలని అనుకుంటున్నారని, చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగే పార్టీ ప్లీనరీకి రావాలని ఆమెకు సందీప్ సింగ్ చెప్పాడు. అక్కడికి వెళ్లిన అర్చనతో సందీప్ అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతోపాటు ఆమెను చంపేస్తానని బెదిరించాడు' అని పోలీసులకు చేసిన ఫిర్యాదులో అర్చనా గౌతమ్ తండ్రి గౌతమ్ బుద్ధా పేర్కొన్నాడు. అంతేకాకుండా తన కుమార్తెను కులం పేరుతో దూషించాడని ఆరోపించాడు. ప్రియాంకా గాంధీ వద్ద పనిచేసే సందీప్ సింగ్.. అర్చనా గౌతమ్‌ను బెదిరించినట్లు ఫిర్యాదు అందిందని మీరట్ ఎస్ఎస్‌పీ రోహిత్ సింగ్ సాజ్వాన్ వెల్లడించారు. నిందితుడిపై ఐపీసీలోని అనేక సెక్షన్లతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. మోడల్‌గా, నటిగా తన కెరీర్ మొదలుపెట్టిన అర్చనా గౌతమ్ బిగ్‌బాస్ కార్యక్రమం ద్వారా మరింత గుర్తింపు సంపాదించారు. రాజకీయాల్లో చేరిన ఆమె... మీరట్ ప్రాంతంలో పట్టున్న దళిత నేతగా కాంగ్రెస్‌లో గుర్తింపు పొందారు. అయితే, 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో హస్తినాపూర్ స్థానం నుంచి పోటీ చేసిన ఆమె ఓటమిపాలయ్యారు.

నీటిపై నేవీ హెలికాప్టర్ ల్యాండింగ్

ముంబై: భారత నౌకాదళానికి చెందిన ఓ తేలికపాటి హెలికాప్టర్‌కు ప్రమాదం తప్పింది. సాంకేతిక లోపం కారణంగా హెలికాప్టర్‌ను అత్యవసరంగా నీటిపై దించారు. ఈ ఘటనలో ముగ్గురు సిబ్బందిని కాపాడినట్లు అధికారులు వెల్లడించారు. నేవీకి చెందిన అధునాతన తేలికపాటి హెలికాప్టర్ (ఏఎల్‌హెచ్) రోజువారీ శిక్షణలో ఉండగా ఈ ఘటన జరిగినట్లు నేవీ అధికారులు తెలిపారు. దీంతో హెలికాప్టర్‌ను ముంబై తీరంలో అత్యవసరంగా నీటిపై ల్యాండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఆ హెలికాప్టర్‌లో ముగ్గురు సిబ్బంది ఉన్నారు. ఘటన గురించి సమాచారం అందగానే రంగంలోకి దిగిన అధికారులు... పెట్రోలింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను పంపించి వారిని కాపాడారని నౌకాదళ అధికార ప్రతినిధి ట్విటర్‌లో వెల్లడించారు. ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్లు తెలిపారు. సాంకేతిక లోపం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

మనీలాండరింగ్ చట్టం పరిధిలోకి క్రిప్టోకరెన్సీ

న్యూఢిల్లీ: అవినీతి నిర్మూలనలో భాగంగా డిజిటల్ సంపదపై పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేస్తూ... క్రిప్టోకరెన్సీ రంగానికి మనీలాండరింగ్ చట్టాన్ని వర్తింపజేయాలని మోదీ సర్కారు నిర్ణయించింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నోటీసులో ఈ వివరాలు తెలిపింది. క్రిప్టో ట్రేడింగ్, సేఫ్ కీపింగ్ సంబంధిత ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు యాంటీ మనీలాండరింగ్ చట్టాన్ని వర్తింపజేసినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటీసు తెలిపింది. క్రిప్టోకరెన్సీ రంగంపై గతేడాది కఠినమైన పన్ను నిబంధనలు అమలు చేసింది. క్రిప్టో ట్రేడింగ్‌పై లెవీని విధించింది. ప్రభుత్వ నిబంధనలతోపాటు అంతర్జాతీయంగా డిజిటల్ అసెట్స్ దెబ్బతినడంతో మన దేశంలో క్రిప్టో ట్రేడింగ్ పరిమాణం తగ్గింది. బ్యాంకులు, స్టాక్ బ్రోకర్లు యాంటీ మనీలాండరింగ్ ప్రమాణాలు పాటిస్తారు. ఇదేవిధంగా డిజిటల్ అసెట్ ప్లాట్‌ఫామ్స్ కూడా ఈ ప్రమాణాలు పాటించాలని ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు గట్టిగా చెబుతున్నాయి. భారత ప్రభుత్వం తాజా నిర్ణయాన్ని అమలు చేయాలంటే వనరులు, సమయం అవసరమవుతాయి.

ప్రశ్నించే గొంతులపై దాడులు

- అదానీ కోసం పనిచేస్తున్న మోదీ
- కోర్టులను ప్రభావితం చేస్తున్న కేంద్రం
- నారాయణ విమర్శలు

విశాలాంధ్రబ్యూరో-తిరుపతి: దేశాభివృద్ధిని పట్టించు కోకుండా మతాన్ని తెరమీదకు తీసుకువచ్చి బీజేపీ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తీవ్రంగా విమర్శించారు. ప్రశ్నించే గొంతుకలపై దాడులు చేస్తూ అణిచివేయాలని చూస్తోందని మండిపడ్డారు. తనకు వ్యతిరేకంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్షపార్టీలు, నేతలపై పనిగట్టుకొని సీబీఐ, ఈడి, ఐటీ తదితర దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తోందని అన్నారు. తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా సమితి సమావేశం జిల్లా కార్యవర్గసభ్యులు కుమార్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. నారాయణ మాట్లాడుతూ బాబ్రీ మసీదు మొదలు పెద్దనోట్ల రద్దు వరకు న్యాయస్థానాల తీర్పులు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఇస్తున్నారని అనుమానం వ్యక్తంచేశారు. పదవీవిరమణ చేయగానే న్యాయమూర్తులకు పదవులు కట్టబెట్టడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. అదానీ కంపెనీ వ్యవహారాలపై విచారణ కోసం ఐదుగురు న్యాయమూర్తులతో కమిటీ వేయగానే...అదానీ కంపెనీ స్వాగతం పలకడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. కమిటీ వేయగానే అదానీ షేర్లు ఒక్కసారిగా పెరిగాయన్నారు. జేసీపీని నిర్వీర్యం చేసేందుకు పక్క పథకం రచించారని విమర్శించారు. అదానీ పోర్టులు అభివృద్ధి చేసుకోవడానికే రహదారులు వేస్తున్నారన్నారు. ఈ పోర్టుల ద్వారా విదేశాల నుండి మాదకద్రవ్యాలు రవాణా చేస్తున్నారని ధ్వజమెత్తారు. బెదిరింపులతో దేశంలోని అన్ని పోర్టులను బలవంతంగా లాక్కుంటున్నారని మండిపడ్డారు. మోదీ అన్నిదార్లు అదానీ వైపు మళ్లించారన్నారు. దేశంలో విద్య, వైద్యరంగాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దేశ అభివృద్ధిని పక్కన పెట్టి మతాన్ని తెరమీదకు తీసుకొచ్చిందన్నారు. ప్రజా స్వామ్యాన్ని కాపాడేందుకు దేశవ్యాప్తంగా పోరాటం సాగిస్తామని స్పష్టంచేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లను 15వ తేదీలోపు లబ్ధిదారులకు అప్పగించకుంటే ఉగాదికి గృహప్రవేశాలు చేయిస్తామని స్పష్టం చేశారు. జగనన్న ఇళ్లకు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలు దొంగ ఓట్లతో జరిపిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ చదువురాని వేలాది మందిని గ్రాడ్యుయేట్ ఓటర్లుగా చేర్చడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల కమిషన్ దీనిపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

భారత విజయయాత్రలో మహిళల పాత్ర అమోఘం

రాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: మహిళలు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నప్పటికీ.. లింగ సమానత్వం కోసం ఇంకా కృషి చేయాల్సిన అవసరముందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె దేశ మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆడపిల్లలు ఇంటికే కాదు...దేశానికే గర్వకారణమని తెలిపారు. అటు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా అనేకమంది రాజకీయ ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా నారీశక్తిని కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. నేడు మహిళలు అన్ని రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. మునుపెన్నడూ లేని రికార్డులు సాధిస్తున్నారు. నాయకత్వ స్థానాల్లోనూ ప్రతిభ చాటుతున్నారు. వారి ఆలోచనలు, విలువలు.. సంతోషకరమైన కుటుంబాన్ని, ఆదర్శవంతమైన సమాజాన్ని, సంపన్న దేశాన్ని తయారుచేయగలవు. లింగ సమానత్వం, మహిళా సాధికారత సాధించడానికి మనం ఇంకా కృషి చేయాల్సిన అవసరముంది. నాణ్యమైన విద్య ద్వారా ఆడబిడ్డలను మరింత శక్తిమంతం చేసేందుకు దేశం కట్టుబడి ఉంది. అతివల భవిష్యత్తు మరింత సంతోషకరంగా ఉండాలని, వారు మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నానని ద్రౌపదీ ముర్ము ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. దేశ నారీమణులకు ఉపరాష్ట్రపతి జగదీప్ దన్కర్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మన జీవితంలో అతివల సహకారాన్ని గుర్తించడానికి ఇది ఒక సందర్భమని, మహిళా సాధికారతతోనే సమాజ సాధికారత అని పేర్కొన్నారు. మెరుగైన ప్రపంచ నిర్మాణం కోసం మన సోదరీమణులు, కుమార్తెలకు అండగా నిలబడాలనే సంకల్పంతో ముందుకెళదామని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ మహిళకు శు భాకాంక్షలు తెలిపారు. మన మహిళా శక్తి సాధించిన విజయాలకు అభినందనలని, దేశ పురోభివృద్ధిలో మహిళల పాత్రకు తాము ఎంతో గర్విస్తున్నామని ట్వీట్ చేశారు. భారత విజయయాత్రలో మహిళల పాత్ర అమోఘమని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని చెప్పుకున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా...మహిళా శక్తికి యావత్ భారతం గర్విస్తోంది. దేశ నిర్మాణంలో వారి త్యాగాలు అనంతరం. వారి ధైర్యం, సాహసం, దృఢ సంకల్పం మనలో ఎంతో స్ఫూర్తి నింపుతుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ సెల్యూట్ అని అమిత్ షా ట్వీట్ చేశారు.

సి.రాఘవాచారి ఏపీ ప్రెస్ అకాడమి అధ్వర్యాన

మహిళా జర్నలిస్టులకు ఘన సత్కారం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న మహిళా జర్నలిస్టులను సి.రాఘవాచారి ఏపీ ప్రెస్ అకాడమి ఘనంగా సత్కరించింది. ప్రెస్ అకాడమి కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, సమాచార పౌర సంబంధాల కమిషనర్ టి.విజయకుమార్ రెడ్డి, ప్రెస్ అకాడమి కార్యదర్శి ఎం.బాలగంగాధర తిలక్ తదితరులు మహిళా జర్నలిస్టులను దుశ్శాలువ, మెమెంటోలతో సత్కరించారు. అకాడమి చైర్మన్ కొమ్మినేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు అన్ని రంగాల్లో సగం కంటే ఎక్కువ అవకాశాలు కల్పించారని, మహిళా సాధికారిత సాధనలో ఇదొక ముందడుగని కొనియాడారు. జర్నలిజం రంగంలో విపత్కర పరిస్థితుల్ని ఎదుర్కొంటూ మహిళా జర్నలిస్టుల చేస్తున్న కృషి అభినందనీయమని, వారికి మరింత ప్రోత్సాహం అందించేందుకు ప్రెస్ అకాడమి అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని త్వరలోనే నిర్వహిస్తామని, ఇందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ అక్రిడిటేషన్ల దరఖాస్తుల్లోని సమాచారం ఆధారంగా రాష్ట్రస్థాయిలో మహిళా జర్నలిస్టుల ఫోరమ్ ఏర్పాటు చేస్తామన్నారు. మహిళా జర్నలిస్టుల సమస్యలు, వాటి పరిష్కారాలకు ఈ వేదిక చక్కని పరిష్కారమౌతుందన్నారు. ఇప్పటికే అక్రిడిటేషన్ కమిటీల్లో 50శాతం మహిళా జర్నలిస్టులు ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. మహిళా జర్నలిస్టుల సమస్యలపై మెరుగైన సలహాలు, సూచనలు ఇస్తే, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్, ఆరోగ్య బీమా పాలసీలను మరింత మెరుగ్గా అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు సేవలు అందేందుకు ఆరోగ్యశ్రీ పథకంలో తగు మార్పులు చేపట్టి, ఆన్‌లైన్ విధానాన్ని మెరుగు పరిచామని తెలిపారు. బాలగంగాధర్ తిలక్ మాట్లాడుతూ మహిళా జర్నలిస్టుల కృషి వెలకట్టలేనిదని అన్నారు. నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం శాఖ విభాగాధిపతి జి. అనిత, సాధారణ పరిపాలన శాఖ సెక్షన్ అధికారిణి హేమలత, మహిళా జర్నలిస్టులు ఈడ్పుగంటి రోమిల (విశాలాంధ్ర), షాయిస్తా ఖానుమ్ (విశాలాంధ్ర), హసీనా షేక్ (టీవీ9.), రెహానా బేగం,(ఎన్‌టీవీ),కాంతి (స్వతంత్ర న్యూస్ ఛానల్), పోరంకి లక్ష్మి(దూరదర్శన్), ఎంఎల్ఎన్ మాధురి (ఆలిండియా రేడియో న్యూస్ రీడర్), కె.అమూల్య (ఫ్రీ లాన్సర్), సుమలత (మహితి పత్రిక), రమణ ముక్తేవిలను సత్కరించి జ్ఞాపికలు అందచేశారు.

నీటిపై నేవీ హెలికాప్టర్ ల్యాండింగ్

ముంబై: భారత నౌకాదళానికి చెందిన ఓ తేలికపాటి హెలికాప్టర్‌కు ప్రమాదం తప్పింది. సాంకేతిక లోపం కారణంగా హెలికాప్టర్‌ను అత్యవసరంగా నీటిపై దించారు.ఈ ఘటనలో ముగ్గురు సిబ్బందిని కాపాడినట్లు అధికారులు వెల్లడించారు. నేవీకి చెందిన అధునాతన తేలికపాటి హెలికాప్టర్ (ఏఎల్‌హెచ్) రోజువారీ శిక్షణలో ఉండగా ఈ ఘటన జరిగినట్లు నేవీ అధికారులు తెలిపారు. దీంతో హెలికాప్టర్‌ను ముంబై తీరంలో అత్యవసరంగా నీటిపై ల్యాండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఆ హెలికాప్టర్‌లో ముగ్గురు సిబ్బంది ఉన్నారు. ఘటన గురించి సమాచారం అందగానే రంగంలోకి దిగిన అధికారులు... పెట్రోలింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను పంపించి వారిని కాపాడారని నౌకాదళ అధికార ప్రతినిధి ట్విటర్‌లో వెల్లడించారు. ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్లు తెలిపారు.

ఆన్‌లైన్ యాప్‌లపై ప్రభుత్వం దృష్టి సారించాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు జి.ఈశ్వరయ్య డిమాండ్

ఏప్రిల్ 26 నుంచి గుంటూరు యువతకు రాజకీయ శిక్షణా తరగతులు : పరుచూరి రాజేంద్రబాబు

విశాలాంధ్ర-విజయవాడ : రోజు రోజుకు సామాజిక మాధ్యమాల్లో అశ్లీలత పెరగటానికి, అసాంఘిక కార్యకలాపాలకు, దోపిడీకి అడ్డాగా మారిన ఆన్‌లైన్ యాప్‌ల మోసాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని, ఆన్‌లైన్ మోసాలను నియంత్రించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర నిర్మాణ బాధ్యులు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక హనుమాన్ పేట దాసరి భవన్‌లో ఏఐవైఎఫ్ కోస్తాంధ్ర జిల్లాల రీజనల్ వర్క్ షాప్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈశ్వరయ్య మాట్లాడుతూ రోజురోజుకి ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయని, అనేక యాప్‌లు, బెట్టింగ్‌లు, అశ్లీలత, అసాంఘిక కార్యక్రమాలు చేస్తుంటే, మరికొన్ని యాప్‌లు లోన్‌ల పేరుతో యువతకు వల వేస్తున్నాయని చెప్పారు. ఫోన్ తెరిస్తే చాలు బూతు వీడియోలు, యాడ్‌లు అశ్లీల చిత్రాలు దర్శనం ఇస్తూ యువతను పెడతోవ పట్టిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నియంత్రించవలసిన ప్రభుత్వాలు కళ్లు ఉండి లేనివిధంగా వ్యవహరించడం సరికాదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను ఓటు బ్యాంకులా మాత్రమే చూస్తున్నారు తప్ప ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలం అయ్యారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు తొత్తులుగా వ్యవహరి స్తున్నారని తెలిపారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు మాట్లాడుతూ అఖిల భారత యువజన సమాఖ్య అధ్వర్యంలో ఏప్రిల్ 26 నుంచి 30 వరకు రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులు గుంటూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యా వేత్తలు, మేధావులు, కళాకారులు, రాజకీయ వేత్తలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తారని, ఈ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కోరారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు పి.చంద్రానాయక్, రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య ఆలపించిన విప్లవ గీతాలు యువతను ఉత్తేజితులను చేశాయి. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు షేక్ సుభాని, వై.బాబీ, ఎం.వి.సుబ్బారావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయ కులు ఎం.సాయి కుమార్, నాసర్ జి, ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లంకా గోవింద రాజులు, పెయ్యల పృధ్వీ, ఏఐవైఎఫ్ నాయకులు వలి, జంగాల చైతన్య, పడమట నరేష్, మున్నా, దాసు, కరుణానిధి, శ్రీను, సురేష్, పవన్, యేసుదాసులతో పాటు 12 జిల్లాల నుంచి యువజన సమాఖ్య నేతలు పాల్గొన్నారు.

ముంబై వీధుల్లో 'దసరా' టీమ్

హైదరాబాద్: సహజ నటుడు నాని త్వరలోనే దసరా సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఈ సినిమా మార్చి 30న విడుదల కానుంది. అయితే నాని సహా చిత్ర బృందం ఇప్పటికే ఇంటర్వ్యూలు ఇస్తూ ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు. కాగా నాని అండ్ దసరా టీమ్ ముంబైలో హోలీని జరుపుకుంది. ముంబై వీధులు ఊర మాస్ డప్పు చప్పుళ్లు, డీజే సౌండ్స్ తో మార్మోగిపోగా... సినీ అభిమానుల సమక్షంలో నాని హోలీ వేడుకల్లో పాల్గొన్నాడు. నానికి రంగులు పూసిన అభిమానులు ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. ఓ వైపు దసరా ప్రమోషన్స్, మరోవైపు హోలీ వేడుకలతో అభిమానుల్లో ఫుల్ జోష్ నింపాడు నాని. ఈ ఫొటోలు, వీడియోలు నెట్టింట్లో ట్రెండింగ్ అవుతున్నాయి. తెలంగాణలోని సింగరేణి బొగ్గు గని గ్రామ నేపథ్యంలో సాగే కథతో వస్తోంది దసరా. ఈ చిత్రంలో కీర్తిసురేశ్ కథానాయికగా నటిస్తోండగా... సాయికుమార్, సముద్రఖని, జరీనా వహబ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. సంతోష్ నారాయణన్ ఈ సినిమాకి సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీకి శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నాడు. కాగా ఈ చిత్రం నుంచి ఛమ్‌కీలా అంగీలేసి పూర్తి నిడివి లిరికల్ వీడియో సాంగ్‌ను బుధవారం విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ ఈ పాటను రాశారు. సంతోష్ నారాయణన్ కంపోజిషన్‌లో రామ్ మిర్యాల పాడారు. పాపులర్ కొరియోగ్రఫర్ రక్షిత్ శెట్టి నృత్యరీతులు సమకూర్చాడు. పల్లెటూరి యాసలో నాని గురించి కీర్తిసురేశ్ పాడుతున్న ఈ పాట మ్యూజిక్ లవర్స్ ను ఆకట్టుకుంటోంది. దసరా చిత్రానికి ఈ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలవడం ఖాయమనిపిస్తోంది.

పథకం ప్రకారమే హత్య

- దళితుడి హత్య కేసు ఛేదించిన పోలీసులు
- మహిళతో పాటు ముగ్గురి అరెస్ట్- రిమాండ్‌కు తరలింపు

విశాలాంధ్ర - పాయకరావుపేట రూరల్ (అనకాపల్లి జిల్లా): అనాకా పల్లి జిల్లా, పాయకరావు పేట మండలంలోని పీఎల్ పురం గ్రామంలో గతనెల 28న గ్రామానికి వడ్లమూరి నాగేంద్ర హత్యకు గురయ్యారు. ఈ కేసును ఎనిమిది రోజులలో పోలీసులు ఛేదించారు. పథకం ప్రకారమే హత్య జరిగిందని తేల్చారు. పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ కె.ప్రవీణ్ కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. నాగేంద్ర గ్రామానికి చెందిన మేడిశెట్టి సూర్యనారాయణ వద్ద పనిచేసేవాడు. మేడిశెట్టి రాజేష్ (21), సిద్ధ పద్మ (32) మధ్య సాన్నిహిత్యం ఉందిడి.. ఇద్దరూ తరచూ ఫోన్లో మాట్లాడుకునేవారు. నాగేంద్ర కూడా పద్మతో ఫోన్‌లో మాట్లాడేవాడు. ఈ విషయాన్ని రాజేష్ తెలుసుకున్నాడు. నాగేంద్ర తనకు తరచూ ఫోన్లు చేసి ఇబ్బంది పెడుతున్నట్లు రాజేష్‌తో పాటు తన తమ్ముడు వెంకటేష్‌కు పద్మ తెలిపింది. దీంతో రాజేష్, నాగేంద్రపై కక్ష పెంచుకున్నాడు. అతనిని చంపేయాలని పద్మ, రాజేష్, వెంకటేష్ కలిసి పథకం రూపొందించారు. అనుకున్న ప్రకారమే 27వ తేదీ అర్ధరాత్రి పద్మతో నాగేంద్రకు ఫోన్ చేయించారు. పద్మ ఇంటికి వచ్చిన నాగేంద్రను ముగ్గురు కలిసి పట్టుకుని కాళ్లు, చేతులు కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి, ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశారు. ఆపై నాగేంద్ర మృతదేహాన్ని పద్మ స్కూటీపై రాజేష్, వెంకటేష్ కలిసి తీసుకొచ్చి మేడిశెట్టి సూర్యనారాయణకు చెందిన వ్యవసాయ భూమిలోని బావిలో కాళ్లు, చేతులు కట్టి పడవేశారు. అనంతరం పరారయ్యారు. నాగేంద్ర సెల్‌ఫోన్, చెప్పులు, రుమాలు కూడా అక్కడే పడవేశారు. నాగేంద్ర తల్లి మరియమ్మ ఫిర్యాదు మేరకు పాయకరావుపేట సీఐ అప్పలరాజు కేసు నమోదు చేశారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి నాగేంద్రను రాజేష్, వెంకటేష్, పద్మ కలిసి హత్య చేసినట్లు నిర్ధారించాం' అని డీఎస్పీ ప్రవీణ్ కుమార్ తెలిపారు. జిల్లా అదనపు ఎస్పీ ఆదేశాల ప్రకారం సర్కిల్ ఇనస్పెక్టర్ ఐదు బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. నిందితులపై ఐపీసీలోని 302, 201 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని, ముగ్గురిని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ చెప్పారు.

అది చెత్తవాగుడు... పట్టించుకోం: రోహిత్

రవిశాస్త్రి విమర్శలకు పరోక్షంగా కౌంటర్

నేటి నుంచి భారత్-ఆసీస్ చివరి టెస్టు

అహ్మదాబాద్: భారత్, ఆస్ట్రేలియా మధ్య బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా చివరిదైన నాలుగో టెస్టు గురువారం నుంచి అహ్మదాబాద్‌లో ప్రారంభం కానుంది. ఈ టెస్టు ప్రారంభానికి ముందు విలేకరుల సమావేశంలో పాల్గొన్న టీమిండియా కెప్టెన్ రోహిత్... మాజీ హెడ్ కోచ్ పై సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఆస్ట్రేలియాతో వరుసగా రెండు టెస్టులను గెలుచుకున్న తర్వాత భారత జట్టు ఇండోర్ లో దారుణ ఓటమిని మూటగట్టుకుంది. ఊహిం చిన దానికంటే అతిగా తిరిగిన ఇండోర్ పిచ్ లో భారత బ్యాటర్లు క్రీజులో నిలవడానికే నానా తంటాలు పడ్డారు. ఇండోర్ లో భారత ప్రదర్శన చూశాక టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి.. రోహిత్ సేనకు అతి విశ్వాసం ఎక్కు వైందని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వ్యాఖ్యలపై రోహిత్ పరోక్షంగా బదులిచ్చాడు. ఇండోర్ టెస్టు జరుగుతున్న సమయంలో కామెంటరీ బాక్స్‌లో ఉన్న రవి శాస్త్రి... భారత వైఫల్యాన్ని చూస్తూ... 'రెండు టెస్టులలో గెలిచిన తర్వాత కొంచెం ఓవర్ కాన్ఫిడెన్స్ కనిపిస్తుంది. ఆట ఆడేప్పుడు కొంచెం జాగ్రత్తగా ఉండండి... లేకుంటే అది మిమ్మల్ని పాతాళానికి పడేస్తుంది'అని వ్యాఖ్యానించాడు. తాజాగా రోహిత్ స్పందిస్తూ... 'వాస్తవంగా చెప్పాలంటే మేం రెండు టెస్టు మ్యాచ్ లను గెలిచిన తర్వాత బయట ఉండేవాళ్లు మాకు ఓవర్ కాన్ఫిడెన్స్ ఎక్కువైందని అన్నారు. ఇది నిజంగా చెత్త వాగుడు. ఎందుకంటే మేం నాలుగు మ్యాచ్‌లలో మా బెస్ట్ ఇవ్వడానికే కష్టపడుతున్నాం... రెండు మ్యాచ్ లు గెలిచిన తర్వాత మేం ఆగిపోవాలని ఎవరూ కోరుకోరు. మేం కూడా అంతే. మాకు అతినమ్మకం పెరిగి పోయిందని, ఇతర కామెంట్లు చేసేవాళ్లందరూ బయటివాళ్లే. వాళ్లకు డ్రెస్సింగ్ రూమ్ లో ఏం జరుగుతుందో తెలియదు...' అని ఘాటుగా స్పందించాడు. రవిశాస్త్రి పేరును ప్రత్యేకించి ప్రస్తావించకపోయినా రోహిత్ అన్న మాటలు శాస్త్రిని ఉద్దేశించి అన్నవేనని టీమిండియా అభిమానులు చెప్పుకుంటున్నారు. రవిశాస్త్రి 2014 నుంచి 2021 వరకూ టీమిండియాకు హెడ్ కోచ్ గా పనిచేశాడు. అతడికి కూడా డ్రెస్సింగ్ రూమ్ సంగతులు ఏ టు జెడ్ తెలుసు. తెలిసి కూడా ఇలాంటి కామెంట్స్ చేసినందుకే రోహిత్ ఆగ్రహం వ్యక్తం చేసి ఉంటాడని అనేకమంది సోషల్ మీడియా వేదికగా వాదిస్తున్నారు. తమకు ఇలాంటి విమర్శలు కొత్త కాదని, స్వదేశంతో పాటు విదేశాల్లో ఆడేందుకు వెళ్లినా ఇవే కామెంట్స్ చేస్తారని, తాము మాత్రం వేటిని పట్టించుకోమని రోహిత్ స్పష్టం చేశాడు.

శ్రీకర్ భరత్‌కు చోటు ఉండేనా?

అహ్మదాబాద్ వేదికగా జరుగబోయే నాలుగో టెస్టులో భారత తుది జట్టులో మార్పులు ఉండొచ్చని తెలుస్తోంది. ఈ సిరీస్ లోనే ఎంట్రీ ఇచ్చి గత మూడు టెస్టులలో దారుణంగా విఫలమైన ఆంధ్రా కుర్రాడు కోన శ్రీకర్ భరత్‌కు అహ్మదాబాద్ టెస్టులో చోటు దక్కడం గగనమేనని జట్టు వర్గాల ద్వారా తెలుస్తోంది. అతడి స్థానంలో పరిమిత ఓవర్లలో ఆడిస్తున్న ఇషాన్ కిషన్ ను ఆడించనున్నారని సమాచారం. రిషభ్ పంత్ గాయపడటంతో తుది జట్టులో చోటు దక్కించుకున్న భరత్... తొలి మూడు టెస్టులలో కీపింగ్ లో ఫర్వాలేదనిపించినా బ్యాటింగ్ లో మాత్రం దారుణంగా విఫలమయ్యాడు. ఈ మూడు టెస్టులలో ఐదు ఇన్నింగ్స్ లలో కలిపి భరత్... 57 పరుగులే చేశాడు. భరత్‌తో పాటు సిరాజ్ ను కూడా తొలగించి మహ్మద్ షమీకి జట్టులో చోటిస్తారని సమాచారం.

హోలీ ఆడుకున్న టీమిండియా

టీమిండియా క్రికెటర్లు హోలీ వేడుకల్లో మునిగి తేలారు. ఒకరిపై ఒకరు గులాల్ చల్లుకున్నారు. అహ్మదాబాద్‌లో ఆసీస్‌తో ఆఖరి టెస్టు ఆడనున్న క్రికెటర్లు.. హోలీ సంబరాల్లో మునిగితేలారు. కుల్దీప్ యాదవ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో హోలీ వీడియోను అప్‌లోడ్ చేశారు. ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, అక్షర్ పటేల్, సిరాజ్‌లు ఆ వీడియోలో హోలీ ఆడుతూ కనిపించారు.

మహిళలకు 'చిరు' శుభాకాంక్షలు

హైదరాబాద్: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెగాస్టార్ చిరంజీవి మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా భార్య సురేఖ, తల్లి అంజనా దేవితో దిగిన ఫొటోను షేర్ చేశారు. 'ప్రపంచంలోని మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. ప్రపంచంలో తమకంటూ సరైన స్థానాన్ని పొందేందుకు పోరాడిన, పోరాడుతున్న స్ఫూర్తిదాయకమైన మహిళలందరికీ వందనం. భవిష్యత్తు తరాలకు మీరే ఆదర్శం. నా జీవితంలో అత్యంత ప్రతిభావంతమైన మహిళలు వీరిద్దరే.' అంటూ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు చిరు. తాజాగా ఆయన నటించిన 'వాల్తేరు వీరయ్య' బ్లాక్‌బస్టర్ హిట్ అయింది. రూ.240 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. ప్రస్తుతం చిరంజీవి మెహర్ రమేశ్ దర్శకత్వంలో 'భోళా శంకర్' చిత్రంలో నటిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. తమన్నా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో కీర్తిసురేశ్ చిరుకి సోదరిగా నటిస్తోంది. క్రియటివ్ కమర్షియల్స్ సమర్పణలో ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రాంబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఆ దర్శకుల నుంచి నేనెంతో నేర్చుకున్నా: వేణు

హైదరాబాద్: కమెడియన్ గా వేణుకి మంచి పేరు ఉంది. తాను టీమ్ లీడర్ గా ఉన్నప్పుడు 'జబర్దస్త్'కి చాలామంది కమెడియన్స్ ను ఆయన పరిచయం చేశాడు. ఇక తాజాగా ఆయన దర్శకత్వంలో వచ్చిన 'బలగం' సినిమా సక్సెస్ టాక్ ను తెచ్చుకుంది. తాజా ఇంటర్వ్యూలో వేణు మాట్లాడుతూ ... ఈ సినిమా కోసం రెండున్నరేళ్లు కేటాయించవలసి వచ్చింది. అన్ని వైపుల నుంచి ఎమోషన్స్ పండేలా చూసుకున్నామని అన్నాడు. ఈ సినిమాను నేను ఇంత బాగా తీయడానికి కారణం, నేను పనిచేసిన దర్శకుల దగ్గర నుంచి సంపాదించుకున్న అనుభవమే... నేర్చుకున్న విషయాలే. కొత్త ఆర్టిస్టుల దగ్గర నుంచి నటన ఎలా రాబట్టుకోవాలనేది తేజ గారిని చూసి నేర్చుకున్నాను. ఇక ఒక సీన్ ను ఆర్టిస్టులకు ఎలా వివరించాలనేది కృష్ణవంశీ గారిని చూసి తెలుసుకున్నాను" అని చెప్పాడు. ఇక త్రివిక్రమ్ గారు రెండు పేజీలకు అవసరమయ్యే సీన్ ను ఒక్క డైలాగ్ లో చెప్పగలరు. 'అత్తారింటికి దారేది' సినిమాలో నేను ఒక చిన్న సీన్ చేశాను. అయినా ఆయన నాకు కథ మొత్తం చెప్పారు. అంత కథ చెబితేనేగానీ ఆ సీన్ విలువ తెలియదు. ఆయన నుంచి అది నేర్చుకున్నాను. అందువల్లనే ఈ సినిమాను ఇంత బాగా తీయగలిగానని చెప్పుకొచ్చాడు.

బుమ్రాకు శస్త్రచికిత్స విజయవంతం

ముంబై: గత ఆరేడు నెలలుగా వెన్నునొప్పితో బాధపడుతున్న భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు న్యూజిలాండ్‌లో నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతమైందని తెలుస్తోంది. న్యూజిలాండ్ మాజీ పేసర్ షేన్ బాండ్, ఇంగ్లాండ్ బౌలర్ జోఫ్రా ఆర్చర్‌లకు గతంలో సర్జరీ నిర్వహించిన డాక్టర్ రోవన్ షౌటెన్ బుమ్రాకు కూడా ఆపరేషన్ చేశాడు. బుమ్రా సర్జరీ కూడా అనుకున్నట్టుగానే విజయవంతం అయిందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. కొద్దిరోజుల క్రితమే బుమ్రాను జాతీయ క్రికెట్ అకాడమీలో వైద్య నిపుణుల సమక్షంలో వైద్యపరీక్షలు నిర్వహించగా అతడి వెన్నులో ఇంకా చిన్న గాయం ఉందని, దానివల్లే అతడు తరుచూ గాయాలపాలై జట్టుకు దూరంగా ఉంటున్నాడని తేలింది. దీనికి సర్జరీ తప్పదని, ఆదమరిస్తే భవిష్యత్‌లో మరోసారి కీలక టోర్నీలకు బుమ్రా దూరంగా ఉండాల్సి వస్తుందని బీసీసీఐ భావించింది. అందుకే బుమ్రాను హుటాహుటిన సర్జరీకోసం న్యూజిలాండ్‌కు పంపిన విషయం తెలిసిందే.

సర్జరీ విజయవంతం అయినా బుమ్రా కోలుకోవడానికి కనీసం ఐదు నుంచి ఆరు నెలల సమయం పట్టొచ్చని అంచనా. అన్నీ అనుకూలించి బుమ్రా ఫిట్నెస్ సాధిస్తే ఆగస్టు మాసాంతం వరకూ లేదా సెప్టెంబర్‌లో గానీ అతడు తిరిగి టీమ్‌తో కలిసే అవకాశముంది. సెప్టెంబర్‌లో ఆసియా కప్ ఉన్న నేపథ్యంలో ఈ టోర్నీ వరకైనా బుమ్రా తిరిగివస్తాడని బీసీసీఐ ఆశలు పెట్టుకుంది. ఒకవేళ ఆసియా కప్ కు దూరమైనా బుమ్రా... అక్టోబర్ -నవంబర్‌లో జరుగబోయే ఐసీసీ వన్డే వరల్డ్ కప్ వరకు ఎలాగైనా ఫిట్నెస్ సాధించాలని బీసీసీఐతో పాటు టీమిండియా, అభిమానులు కోరుకుంటున్నారు. గత ఆగస్టులో ఆసియా కప్‌కు ముందే గాయపడ్డ బుమ్రా... సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియా టూర్‌లో ఒక్క మ్యాచ్ ఆడాడు. కానీ మళ్లీ గాయం తిరగ బెట్టడంతో టీ20 ప్రపంచకప్‌కు దూరమయ్యాడు. మళ్లీ జనవరిలో జట్టులోకి వచ్చినా ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే ఎన్సీఏకు చేరిన విషయం తెలిసిందే. గాయం కారణంగా బుమ్రా ఈ నెల చివరి నుంచి జరుగబోయే ఐపీఎల్‌తో పాటు జూన్ లో జరుగబోయే డబ్ల్యూటీసీ ఫైనల్స్‌లో (భారత్ అర్హత సాధిస్తే) కూడా ఆడేందుకు అవకాశం కోల్పోయాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.